ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

సోమవారం 1 సెప్టెంబరు 2025 | 3

ఇందుపల్లిలో వేద సభ 5

నేటి నుంచి అంతర్వేదిలో పవిత్రోత్సవాలు 5



సూపర్‌సిక్స్‌లో భాగంగా స్త్రీశక్తి పథకం విజయోత్సవాల్లో భాగంగా రామచంద్రపురం నియోజకవర్గంలోని ద్రాక్షారామలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి మహిళలతో కలిసి పాలాభిషేకం చేస్తున్న మంత్రి సుభాష్



అంతర్వేది చెరువుగట్టు వద్ద వినాయకుడు

అయినవిల్లికి పోటెత్తిన భక్తులు

అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయానికి భక్తజనం పోటెత్తారు. వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా స్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. జిల్లాలో గణపతి నవరాత్రులు ఘనంగా జరుగుతున్నాయి.



అయినవిల్లి సిద్ధివినాయక ఆలయం వద్ద భక్తుల రద్దీ



స్వామివారి అలంకరణ

ఉధృతంగా గోదావరి



అలమూరు మండలం జొన్నాడ వద్ద ఉధృతంగా గోదావరి



కోటిపల్లి వద్ద గోదావరి ఉధృతి

- పొంగి ప్రవహిస్తున్న గౌతమీ, వశిష్ట, వైనతేయ, వృద్ధగౌతమీ నదులు
- ఎగువ నుంచి సముద్రంలోకి 14 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల
- సఖినేటిపల్లి-నర్సాపురం రేవు సహా పలుచోట్ల పంట్లు నిలుపుదల
- నీటమునిగిన కాజ్‌వేలు.. మునుగుతున్న లంక గ్రామాలు
- గణేష్ నిమజ్జనాల్లో జాగ్రత్తలు పాటించాలంటున్న అధికారులు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

గోదావరి వరద ఆదివారం ఉధృతంగా పెరుగుతోంది. దీంతో జిల్లాలోని గౌతమీ, వృద్ధగౌతమీ, వైనతేయ, వశిష్ట నదీపాయలు పొంగిప్రవహిస్తున్నాయి. లంక గ్రామాల్లోకి వరదనీరు చేరుతుండడంతో ఆయా గ్రామాల ప్రజలు అప్రమత్తమవుతున్నారు.

నదీపరివాహక గ్రామాల్లో అలెర్ట్

జిల్లావ్యాప్తంగా ప్రధాన రేవులతోపాటు వివిధ ప్రాంతాల్లో పంట్లు, పడవలపై ప్రయాణాలను ముందు జాగ్రత్త చర్యగా నిలిపివేశారు. నియోజకవర్గ స్థాయిలో నియమితులైన ప్రత్యేకాధికారులు, ఆర్డీవోలు ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు. భద్రాచలం వద్ద గోదావరికి రెండో ప్రమాద హెచ్చరికను దాటి ప్రవహిస్తోంది. పోలవరం స్పిల్‌వే ద్వారా 11లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేశారు. దీంతో ధవళేశ్వరంవద్ద మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేసి కోనసీమ జిల్లాలోని నదీపరివాహక గ్రామాలకు అలెర్ట్ ప్రకటించారు. 14లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదలడంతో కోనసీమలోని నదీపరివాహక గ్రామాల్లో వరద ముంపు అనూహ్యంగా పెరిగింది. తొగరపాయ, చాకలిపాలెంవద్ద కాజ్‌వేలపై వరదనీరుచేరడంతో అక్కడ పరిస్థితులను అధికారులు సమీక్షించారు. జిల్లావ్యాప్తంగా 40కుపైగాలంకగ్రామాలు జలదిగ్బంధానికి గురికావచ్చని సమాచారం.

నిలిచిన పంటు ప్రయాణాలు

కాగా వశిష్టనది ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నందున ఉమ్మడి గోదావరి జిల్లా ప్రాంతమైన సఖినేటిపల్లి-నర్సాపురం మధ్య పంటు ప్రయాణాలను ఆదివారంనుంచి నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. మరోవైపు దిండి-చించినాడ వంతెన మరమ్మతుల కారణంగా పశ్చిమగోదావరి వెళ్లే ప్రయాణికులు, విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారు. గౌతమీ నదిపై ముక్తేశ్వరం-కోటిపల్లి వెళ్లే పంటు ప్రయాణాలు ఇప్పటికే నిలిచిపోయాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కొన్ని అనధికారిక రేవుల్లో నిర్వహిస్తున్న పడవ ప్రయాణాలు వరద ప్రమాదకర పరిస్థితుల దృష్ట్యా నిలిపివేయాలని అధికారులు సూచిస్తున్నారు. కాగా అప్పనపల్లి కాజ్‌వే వద్ద వరద పరిస్థితి పెరగడంతో ఆయా గ్రామాలకు రవాణా సౌకర్యాలు నిలిచిపోయాయి. వరద ఉధృతంగా పెరుగుతున్న దృష్ట్యా నదీ పరివాహక లంక గ్రామాల ప్రజలు అప్రమత్తతతో ఉండాలని అధికారులు పిలుపునిచ్చారు. పి.గన్నవరం మండలం జి.పెదపూడి వద్ద తాత్కాలిక గట్టు తెగిపోవడంతో నాలుగు లంక గ్రామాల ప్రజలకు పడవలపై లైఫ్ జాకెట్ల సహాయంతో పదిరోజులుగా దాటిస్తున్నారు. శని, ఆదివారాలతో పోలిస్తే సోమవారం నాటికి వరద ఉధృతి మరింత పెరిగితే చేపట్టాల్సిన జాగ్రత్తలపై అధికారులు నియోజకవర్గ స్థాయిలో సమీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఎక్కడా పునరావాస చర్యలను ఇంకా ప్రారంభించలేదు. ముందు జాగ్రత్తగా లంకప్రాంతాల్లో ఉన్న పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించుకునే పనిలో రైతులు ఉన్నారు. దీనికి తోడు వరద ఉధృతంగా పెరిగే సంకేతాల నేపథ్యంలో లంక ప్రాంతంలో ఉన్న కొబ్బరితోటల్లోని దింపులు తీసి సురక్షిత ప్రాంతాలకు తరలించుకుంటున్నారు. రానున్న 48 గంటల్లో కోస్తా జిల్లాలకు మరోసారి భారీ వర్షాల దృష్ట్యా వరదల ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉందని జలవనరులశాఖ అధికారుల అంచనా వేస్తున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల వద్ద వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది మాత్రమే దర్శనమిస్తున్నా కొన్నిశాఖల అధికారులు అసలు పత్తా లేకుండా పోయారు. కాగా సోమవారం నుంచి గణేష్ నిమజ్జనాలు జిల్లావ్యాప్తంగా ప్రారంభం కానున్నాయి. నదీతీర గ్రామాలవారు నదుల్లోను, కొన్నిచోట్ల పంటకాల్వల్లోను నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈసారి ప్రస్తుతం వరద ఉధృతి పెరుగుతున్న దృష్ట్యా పోలీసు రెవెన్యూ అధికారులు గణేష్ నిమజ్జనాలపై విధించిన ఆంక్షల వల్ల నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రమాదకర స్థాయిలో నదులు పొంగుతున్నందున సహకరించాలని అధికారులు కోరుతున్నారు.

లంక గ్రామాల్లో పాఠశాలలకు సెలవు

గోదావరిలో వరద పెరుగుతున్న కారణంగా మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ఉన్నతాధికారులు సోమవారం సెలవు ప్రకటించారని మండల విద్యాశాఖాధికారులు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మండలంతోపాటు పశ్చిమగోదావరి జిల్లా గ్రామాల నుంచి జిల్లాలోని వివిధ ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు వెళ్తున్న 327మంది విద్యార్థులకు సెలవు ప్రకటించారన్నారు. లంక గ్రామాల నుంచి వస్తున్న విద్యార్థులను పాఠశాలలకు పంపించవద్దని తల్లిదండ్రులకు సూచిస్తున్నామని, నదీపాయలను దాటించవద్దని అధికారులను ఆదేశించామని చెప్పారు. మండలంలో గంటిపెదపూడి, ఉడిమూడి పరిధిలోఉన్న పాఠశాలలకు కాంపన్సేటరీ సెలవు ప్రకటించామని స్పష్టం చేశారు.



పి.గన్నవరం మండలం చాకలిపాలెం-కనకాయలంక కాజ్‌వే వద్ద లంకగ్రామాల ప్రజల రాకపోకలు



ముమ్మిడివరం మండలం గురజాపులంకలో వరదనీటిలో నడిచివస్తున్న లంక వాసులు



మామిడికుదురు మండలం అప్పనపల్లి స్నానాలరేవు వద్ద పరవళ్లు తొక్కుతున్న గోదావరి

మళ్లీ తెరపైకి

విలీనం



అమలాపురం మండలం ఈదరపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం

- అమలాపురం పురపాలక సంఘంలో గ్రామాల విలీనానికి కౌన్సిల్ ఓకే
- ప్రధాన ఆదాయ వనరులను కోల్పోనున్న గ్రామాలు

అమలాపురం రూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): అమలాపురం పురపాలక సంఘానికి ఆనుకుని ఉన్న గ్రామాల విలీన ప్రతిపాదన మరోసారి తెరపైకి వచ్చింది. గతంలో స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు ఇదే తరహాలో ప్రతిపాదనలు ఆమోదించారు. అమలాపురం పురపాలక సంఘాన్ని కార్పొరేషన్ స్థాయికి విస్తరించాలని దశాబ్దకాలంగా ఈవిధమైన చర్యలు తీసుకుంటూనే ఉన్నారు. స్థానిక నేతలు అత్యున్నత న్యాయస్థానాలను ఆశ్రయిస్తుండడంతో విలీన ప్రక్రియ ఎప్పటికప్పుడు ఆగిపోతూ వచ్చింది. ఈసారి మరోలా విలీన ప్రక్రియకు అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు చర్యలు చేపట్టారు. పురపాలక సంఘంలో ప్రధాన ఆదాయ వనరులు ఉన్న గ్రామీణ ప్రాంతాలను విలీనం చేస్తే గ్రామ పంచాయతీ ఆర్థిక పరిస్థితి ఏమిటన్న ప్రశ్న స్థానిక నేతల్లో వ్యక్తమవుతోంది.

విలీన ప్రతిపాదన ఎలా అంటే..

గతంలో అమలాపురం పురపాలక సంఘాన్ని ఆనుకుని ఉన్న 11గ్రామాలను విలీనం చేసేందుకు నిర్ణయించడంతో స్థానిక నేతలు వ్యతిరేకించారు. ఈసారి అలా కాకుండా పురపాలక సంఘానికి పూర్తిగా ఆనుకుని ఉన్న ఈదరపల్లి గ్రామాన్ని పూర్తిగా విలీనం చేసేలా నిర్ణయించారు. కామనగరువు, పేరూరు గ్రామాల్లోని ముఖ్యమైన ప్రాంతాలు పట్టణాన్ని ఆనుకుని ఉండడంతో వాటన్నింటినీ విలీనంచేసేలా అడుగులు వేస్తున్నారు. జాతీయ రహదారిని ఆనుకుని పేరూరు బిట్-2లో ఉన్న కొంకాపల్లి, ఎస్కేబీఆర్ కళాశాలప్రాంతం, బ్యాంకుకాలనీ, పోస్టల్‌కాలనీ, నారాయణపేట నుంచి పేరూరు వై. జంక్షన్ వరకు విలీనం చేసే ప్రతిపాదన. కామనగరువులోని హైవే బైపాస్ రోడ్డు వరకు ఉన్న ప్రాంతాలను అంటే కిమ్స్ వైద్య కళాశాలతోపాటు ప్రధాన కాలనీలన్నీ పట్టణంలో విలీనం చేసేలా ప్రతిపాదించారు. ఇప్పటికే ఆయా ప్రాంతాలన్నీ నీటిసరఫరా, వ్యర్థ పదార్థాల నిర్వహణ, ఆరోగ్య సేవలు, రవాణా, పౌరసౌకర్యాలకు పురపాలక సంఘంపై ఆధారపడుతున్నారని, ఆగస్టు 28న జరిగిన పురపాలక సంఘ కౌన్సిల్ సమావేశంలో 47వ అంశంగా ఎజెండాకు తీసుకువచ్చి ఆమోదించారు. ఆయా ప్రాంతాలను పురపాలక సంఘంలో విలీనంచేసే తీర్మానాన్ని ఆమోదించి సంబంధిత ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించనున్నారు.

పూర్తి విలీనం ఎందుకు వద్దన్నారంటే..

గతంలో మాదిరిగా అమలాపురం పట్టణాన్ని ఆనుకుని ఉన్న ఈదరపల్లి, బండారులంక, కామనగరువు, పేరూరు వంటి మేజర్ పంచాయతీలతో సహా మొత్తం 11 గ్రామాలను పురపాలక సంఘంలో విలీనం చేసేందుకు అప్పట్లోనే నిర్ణయించారు. అయితే ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలు ఎక్కువగా ఉన్నారని ప్రభుత్వం గుర్తించింది. ఆయా గ్రామాలకు ఉపాధి హామీ పథకం కింద నిధులు రావాలన్నా, కూలీలకు పనులు కల్పించాలన్న విలీనానికి దూరంగా ఉంచాల్సిందే. అందుకే పట్టణాన్ని ఆనుకుని జాతీయ రహదారి, బైపాస్ రోడ్లను ఆనుకుని ఉన్న ప్రధాన కాలనీలన్నింటినీ పురపాలక సంఘంలో కలిపేలా తీర్మానించారు.

నష్టాల బాటలో..

తమలపాకు రైతు



- పడిపోయిన ధర.. తగ్గిన సాగు.. పెరిగిన ఖర్చులు
- 25 మోదలతో ఉన్న బుట్ట రూ.400 నుంచి రూ.800 మాత్రమే

రావులపాలెం,ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): అందరి నోరు పండించే తమలపాకు కలిసి రాకపోవడంతో రైతుకు కడుపు మండుతోంది. జిల్లాలోని రావులపాలెంమండలం గోపాలపురంలో ఒకప్పుడు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే అత్యధిక విస్తీర్ణంలో తమలపాకు సాగు చేసేవారు. స్థానికరైతులేకాకుండా ఇతర ప్రాంతాలవారు లంకపొలాలను లీజుకు తీసుకుని తమలపాకులను పండించేవారు. 20ఏళ్లుగా వరదలు, తుఫాన్లు, ప్రకృతి వైపరీత్యాల నష్టాలను అధిగమించి తమలపాకులను సాగుచేసేవారు. కరోనాలో తీవ్రనష్టాలు చవి చూసిన రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు వెళ్లిపోయారు. ప్రభుత్వ ప్రోత్సాహం కూడా పూర్తిస్థాయిలో లేకపోవడంతో సాగుపై నిరాశ చెందారు. గతంలో గోపాలపురంలో 300నుంచి 400 ఎకరాల విస్తీర్ణంలోఉండే సాగు నేడు 30 నుంచి 40 ఎకరాలకు మాత్రమే పరిమితమైంది. ఒక ఎకరం పొలంలో తమలపాకు సాగుచేయాలంటే భూమి లీజు, పెట్టుబడులు రూ.3 లక్షల వరకు ఖర్చవుతోంది. తీగపాతిన ఆరు నెలలకు కోతకు వస్తుంది. సాగు తగ్గింది. దిగుబడికి తగ్గ ధర అనుకున్న రీతిలో పలక్కపోవడంతో రైతులు తమలపాకు సాగుపై విముఖత చూపుతున్నారు.ప్రస్తుతం 25 మోదలతో ఉన్న బుట్ట రూ.400 నుంచి రూ.800 మాత్రమే పలుకుతోంది. ఆకు కోత కూలి, గంప ఖర్చు, గంప పేర్పిడి, మోద కట్టుబడి, కిరాయి, కమిషను వీటికే రూ.400నుంచి రూ.500 ఖర్చవుతుందని రైతులు పేర్కొంటున్నారు. దీంతో పెట్టిన పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొంటుంది. బుట్ట రూ.1000కిపైబడి ధర పలికితే కొంతమేర లాభాల బాటలో పయనిస్తామని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది మేనెల నుంచి డిసెంబరు నెల వరకూ బుట్ట రూ.1000 నుంచి రూ.1500 వరకూ పలికింది. అనుకున్న రీతిలో ధర లేక ప్రత్యామ్నాయంవైపు రైతులు చూస్తున్నారు.

భోజనాల బిల్లులు ఇవ్వరా?

- వైసీపీ హయాంలో వరద బాధితులకు భోజనాలు
- ఐదేళ్లు పూర్తయినా అందని బిల్లులు
- పట్టించుకోని మండల పరిషత్ అధికారులు

పి.గన్నవరం,ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో వచ్చిన వరదలకు బాధితులు ఆదుకోవాలని ప్రభుత్వం ప్రకటనలు చేసి హడావిడి చేసింది. బాధితులకు భోజనాలు ఏర్పాటు చేసిన చిరు ఉద్యోగులు, వ్యాపారులకు ఐదేళ్లు గడిచినా ఇప్పటివరకు బిల్లులు చెల్లించలేదు. పి.గన్నవరం మండలంలో 2020, 2022ల్లో వచ్చిన వరదలకు భోజనాలు నిమిత్తం నిధులు రాకుండానే ఉన్నతాధికారులు హామీతో చిరుఉద్యోగులు,వ్యాపారులు పెట్టుబడి పెట్టారు. ఎన్నిసార్లు జిల్లా అధికారులు, మండల అధికారుల చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం లేక లక్షలకు వడ్డీలు చెల్లించలేక అవస్థలు పడతున్నారు. 2020లో పలువురు వ్యాపారులు, ఉద్యోగులకు రూ.43.55లక్షలు రావాల్సి ఉంది. 2022లో విచిత్ర పరిణామం జరిగింది.

వరద పెత్తనం అప్పటి ఎంపీడీవో కేఆర్ విజయకు అప్పగించడంతో ఆ కార్యాలయంలో ఒక ఉద్యోగితోపాటు ఇతరశాఖలకు చెందిన మరో ఇద్దరు చిరుద్యోగులు సంబంధిత అధికారి మౌఖిక ఆదేశాలతో రూ.5.90లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. వారికి ఇప్పటివరకు కనీసం ఒక్క రూపాయి కూడా రాకపోగా మండలపరిషత్ అధికారులు పట్టించుకోవడం లేదు. గ్రీవెన్స్‌లో సమస్య చెప్పుకుంటే అర్జీకి నామమాత్రపు సమాధానంతో క్లోజ్ చేస్తున్నారు. 2022లో మండల పరిషత్, రెవెన్యూ కార్యాలయాలకు సంబంధించి రూ.10లక్షల వరకు రావాల్సి ఉంది. 2020లో ఒక హోటల్ యజమానికి రు.7లక్షల వరకు ఇవ్వాల్సి ఉంది. సంబంధిత వ్యక్తి మండలస్థాయిలో జరిగిన ఓ గ్రీవెన్స్‌లో జేసీ ఎదుట ఆత్మహత్య చేసుకుంటానని నిరసన కూడా వ్యక్తం చేశాడు. అయినా ఇంకా భోజనాలు సొమ్ము రాలేదని, అప్పులు కట్టలేకపోతున్నాని ఆ వ్యాపారి ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. 2022, 2023ల్లో వచ్చిన వరదలకు భోజనాల నిమిత్తం మానేపల్లిలో వైసీపీ సర్పంచ్ భర్త పితాని నరసింహారావుకు రూ.7లక్షల వరకు రావాల్సి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయాన్ని వారాహి యాత్రలో భాగంగా మలికిపురంలో జరిగిన బహిరంగసభలో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ప్రస్తావించారని, తమ గోడును కూటమి ప్రభుత్వం పట్టించుకుని బిల్లులు చెల్లించాలని వారు కోరుతున్నారు.



లంకలగన్నవరంలో 2022 వరదలకు భోజనాలు అందిస్తున్న ప్రత్యేక అధికారి(పాత చిత్రం)

రూ.5.64లక్షల బిల్లులు చెల్లించాలి: చిరుద్యోగి

2022 వరదలకు పి.గన్నవరంలో స్థానిక హోటల్ యజమానులు డబ్బులు ఇస్తేగానీ భోజనం ప్యాకెట్లు తయారు చేయడానికి ముందుకు రాకపోవడంతో పంచాయతీ, మండల పరిషత్, ఉపాధి హామీ కార్యాలయాల్లో పనిచేస్తున్న చిరుఉద్యోగులు భోజనం ప్యాకెట్లు తయారీకి రూ.5.64లక్షలు చెల్లించి వరద బాధితులకు అందించాం. వారం పదిరోజుల్లో బిల్లులు వచ్చేస్తాయని ఉన్నత అధికారులు అభయం ఇవ్వడంతో అప్పులు చేసి మరీ ఖర్చుపెట్టాం. అనేకసార్లు కలెక్టర్, జేసీ, డీఆర్‌వోల వద్దకు బిల్లులు కోసం తిరిగినా ప్రభుత్వంనుంచి నిధులు రాగానే చెల్లిస్తామన్నారు. కానీ, అలా జరగలేదు.

విద్యార్థుల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్



లెర్నింగ్ లైసెన్స్ పత్రాలు అందజేస్తున్న డీటీవో

అమలాపురంటౌన్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):రవాణాశాఖ తనిఖీల్లో హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్సులేకుండా మోటారుసైకిళ్లు నడుపుతూ పట్టుబడిన విద్యార్థుల తల్లిదండ్రులను అమలాపురం రవాణాశాఖ కార్యాలయానికి పిలిచి జిల్లారవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. తల్లిదండ్రుల నిర్లక్ష్య ధోరణిపట్ల ఆవేదన వ్యక్తం చేశారు. బైక్ నడిపే 18ఏళ్లు నిండిన ప్రతి విద్యార్థి తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండి హెల్మెట్ ధరించాలని, తల్లిదండ్రులు ఆ బాధ్యత తీసుకోవాలని సూచించారు. డీటీవో సమక్షంలోనే ఆన్‌లైన్‌లో అపరాధ రుసుము చెల్లించి విద్యార్థులకు లెర్నింగ్ లైసెన్సు కోసం స్లాట్ బుక్ చేసి ఎల్ఎల్ఆర్ పరీక్షకు హాజరు కావాలని సూచించారు.

నిదానంగా పెరుగుతున్న గోదావరి

» కొనసాగుతున్న మొదటి ప్రమాద హెచ్చరిక

» 11,35,249 క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల



ధవళేశ్వరం రామపాదాల రేవు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

ధవళేశ్వరం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం వద్ద గోదావరి నిదానంగా పెరుగుతూ ప్రవహిస్తోంది. శనివారం రాత్రి 9గంటలకు మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయి 11.75 అడుగులకు చేరుకుంది. ఆపై కొన్ని గంటల పాటు నిలకడగా ఉండి 2,3 గంటలకు ఒక పాయింట్ చొప్పున పెరుగుతూ ఆదివారం మధ్యాహ్నం 4గంటలకు 12.80 అడుగులకు చేరుకుంది. రాత్రి 7గంటలకు అదే రీడి ంగ్ వద్ద నిలకడగా కొనసాగింది. ఈ సమయంలో కాటన్ బ్యారేజ్ నుంచి 11,35,249 క్యూసెక్కులు దిగువకు ప్రవహిస్తోంది. వ్యవసాయ అవసరాల కోసం తూర్పు డెల్టాకు 4700 క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 2300 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 5500 క్యూసెక్కులు చొప్పు న సాగునీటిని విడుదల చేస్తున్నారు.

ఎగువున భద్రాచలం వద్ద ఆదివారం ఉదయం 8గంటలకు నీటి మట్టం 48 అడుగులకు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఆపై ఒక పాయింట్ మాత్రమే పెరిగి 48.10 అడుగుల వద్ద నిలకడగా కొనసాగుతోంది. ఎగువున కాళేశ్వరం, పేరూరు వద్ద నీటి మట్టం తగ్గుతుండగా దిగువున దుమ్ముగూడెం, భద్రాచలం, కూనవరం, కుంట, పోలవరం వద్ద నిలకడగా ఉంది.

నిలకడగా శబరి

చింతూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): శబరి, గోదావరి నదులు నిలకడగా ఉన్నాయి. ఆదివారం రాత్రి 7 గంటలకు భద్రాచలం వద్ద గోదావరి 47.90 అడుగులు ఉండగా, చింతూరు వద్ద శబరి నది 32 అడుగుల మేర ప్రవహిస్తోంది. శబరి తగ్గకపోవడంతో దాదాపు పది రోజులుగా లోతట్టు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయి అవస్థలు పడుతున్నారు. నిత్యావసర వస్తువులు అందజేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

సకాలంలో వైద్యం అందక మహిళ మృతి



సుబ్బమ్మను ఆసుపత్రికి తరలిస్తున్న కుటుంబీకులు, ఆసుపత్రిలో మృతిచెందడంతో మృతదేహాన్ని నాటు పడవపై తరలిస్తున్న దృశ్యం



నాటు పడవపై మృతదేహం తరలింపు

చింతూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వరద కారణంగా రహదారులు మూసుకుపోయాయి. దీంతో లోతట్టువాసులు సకాలంలో ఆసుపత్రులకు చేరలేని పరిస్థితి విలీన మండలాల్లో ఉంది. దీంతో కొందరి ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. వరరామచంద్రపురం మండలం కుంజవారిగూడెనికి చెందిన బొడ్డు సుబ్బమ్మ (65) రక్త హీనత కారణంగా బాగా నీరసించింది. శనివారం ఆమె కుటుంబీకులు సోకిలేరు వాగు మీదుగా నాటు పడవ దాటించి చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతిచెందింది. దీంతో కుటుంబీకులు ఆసుపత్రి నుంచి సోకిలేరు వాగు వద్దకు ఆటోపై మృతదేహాన్ని తరలించి అక్కడి నుంచి నాటు పడవపై వాగు దాటించి మరో ఆటోపై కుంజవారిగూడెం తరలించారు.

ఇందుపల్లిలో వేద సభ



ఇందుపల్లిలో జరిగిన వేద సభలో పాల్గొన్న వేదపండితులు

అమలాపురం రూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): సమస్త జీవకోటి సుభిక్షంగా జీవించేందుకు, మానవాళి జీవన విధానానికి వేదమే ప్రామాణికమని గుళ్లపల్లి దత్తాత్రేయ ఘనాపాఠి పేర్కొన్నారు. బ్రహ్మశ్రీ రాణి హయగ్రీవ అవధాని వేదశాస్త్ర పరిషత్ 14వ వార్షిక వేద సభ ఆదివారం కోనసీమ జిల్లా ఇందుపల్లి అరవ గరువులో నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం సౌజన్యంతో శ్రీబాలభక్తగణపతి మందిరంలో నిర్వహించిన వేద సభకు తొలుత టీకే విశ్వనాథ్ వేదపండితులకు స్వాగతం పలికారు. అనంతరం జరిగిన వేద సభలో దువ్వూరి సూర్యప్రకాశ సోమయాజులు మాట్లాడుతూ మానవులు సమస్త జీవకోటి కోసం ఆచరించాల్సిన ఆచారాలు, కర్మకాండల గురించి వేదాల్లో వివరించిన విధానాన్ని తెలియజేశారు. సమస్త విద్యల స్వరూపంగా వేదాలు భాషిస్తున్నాయని పేర్కొన్నారు. వడ్లమాని సుబ్రహ్మణ్య ఘనాపాఠి మాట్లాడుతూ ఎక్కడ వేదపఠనం జరుగుతుందో అక్కడ జీవరాశులు ఏవిధంగా సుభిక్షంగా ఉంటాయో వివరించారు. వేదికపై తంగిరాల సుబ్రహ్మణ్య సోమయాజులు పాల్గొని వేదాలు, ఉపనిషత్తుల సారాంశం తెలియచేశారు. తత్వ స్వరూపమై ఉన్న పరమాత్మున్ని తెలుసుకునేందుకు ఉపనిషత్తులు ఏవిధంగా దోహదపడతాయో విశదీకరిం చారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేదపండితులు, ఘనాపాఠిలు, క్రమపాఠిలు వేదస్వస్తి నిర్వహించారు. కార్యక్రమంలో శిష్టా భవానీశంకర్, వేదశాస్త్ర పరిషత్ అధ్యక్షుడు కర్రా సోమసుందరశాస్త్రి, కార్యదర్శి ముష్టి వేంకటరాజేశ్వరశర్మ, కోశాధికారి అల్లవరపు సుబ్రహ్మణ్యదీక్షితులు, ప్రముఖులు పాల్గొన్నారు. అనంతరం వేదశాస్త్ర పరిషత్ తరపున ఘనాపాఠీలు, పండితులను సత్కరించారు.

గణపతి ఆలయం.. భక్తజన సంద్రం!

బిక్కవోలులో ప్రత్యేక పూజలు





బిక్కవోలులో శ్రీలక్ష్మీగణపతి దర్శనానికి బారులు తీరి స్వామివారి చెవిలో కోర్కెలు చెప్తున్న భక్తులు

బిక్కవోలు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ఐదో రోజైన ఆదివారం తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలులోని ప్రాచీన శ్రీలక్ష్మీగణపతి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అర్చకులు శ్రీలక్ష్మీగణపతికి మూల మంత్ర పూజలు, మంత్రజపతర్పణ, హావనములు, సావిత్రి పంటకోట ఉపషనిత్తు పారాయణాలు జరిపారు. హైకోర్టు ప్లీడర్లు స్వామి దర్శనానికి రావడంతో ఆలయ ఈవో ఆకెళ్ల బాస్కర్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు చాగంటి సాయిబాబా రెడ్డి వారికి పూర్ణకుంభ స్వాగతం పలికి ఆలయ అర్చకులతో ఆశీర్వచనాలు అందజేశారు. స్వామిని దర్శించుకున్నవారిలో హైకోర్టు జీపీ నాగరాజు నాగురు, పీపీలు మెండా లక్ష్మీనారాయణ, కైలార్ కృష్ణ, ఏపీ జెన్‌కో జీపీ భూషణచౌదరి, కమర్షియల్ టాక్స్ జీపీ బొబ్బా స్వామికిరణ్, ఇరిగేషన్ జీపీ శ్యామ్‌సుందరరావు వున్నారు. ఉచిత బస్సు పథకం కారణంగా మహిళలు బిక్కవోలులోని ప్రాచీన ఆలయాలకు పోటెత్తారు.





అయినవిల్లిలో స్వామికి పంచ హారతులు, ఆలయం వద్ద భక్తులు

అయినవిల్లిలో ప్రత్యేక అలంకరణ

అయినవిల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయానికి ఆదివారం భక్తజనం పోటెత్తారు. స్వామికి అభిషేకాలు, లక్ష దూర్వార్చన తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. మూషిక వాహనంపై స్వామికి మాడవీధి సేవ అనంతరం పంచ హారతులిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు క్యూలైన్లలో వేచి ఉండడంతో దేవస్థానం బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేసింది.

రాష్ట్ర సర్వే అకాడమీ రీజనల్ జేడీగా కుమార్



కుమార్

సామర్లకోట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సర్వే అకాడమీ రీజనల్ జాయింట్ డైరెక్టర్‌గా సీహెచ్‌వీఎస్ఎన్. కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాకినాడ జిల్లా సామర్లకోటలో ఉన్న రాష్ట్ర సర్వే ట్రైనింగ్ అకాడమీ జేడీ, వైస్ ప్రిన్సిపాల్‌గా గత ఐదేళ్లుగా కుమార్ పనిచేస్తుండగా రీజనల్ జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పించారు. తాజాగా పదోన్నతి పొందిన ఆర్‌జేడీ మల్టీజోన్ పరిధిలో శ్రీకాకుళం నుంచి ఎన్టీఆర్ జిల్లా వరకూ 13 జిల్లాలు సామర్లకోట పరిధిలోకి వస్తాయి. గతంలో కుమార్ అమరావతిలోని రాజధానిలో 33 వేల ఎకరాల భూమికి రికార్డుస్థాయిలో సర్వే నిర్వహించారు. అందుకుగాను అప్పటి సీఎం చంద్రబాబు చేతుల మీదుగా చీఫ్ మినిస్టర్ స్టేట్ అవార్డు అందు కున్నారు. సర్వే ట్రైనింగ్ అకాడమీ ప్రిన్సిపాల్‌గా గత ఐదేళ్లుగా 25 వేలమందికి పైగా సర్వే, రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్ సిబ్బందికి రోవర్, సీవోఆర్ఎస్, క్యూజిస్, డ్రోన్‌సర్వే తదితర అంశాలపై 137 రకాల అధునాతన సర్వే శిక్షణ అందించారు. ఏపీ రీసర్వే ప్రాజెక్ట్‌లో 32 వేల చదరపు కిలో మీటర్లు హెలీకాప్టర్ ఫ్లై, డ్రోన్ ఫ్లై చేయించారు.

నర్సింగ్ పరీక్ష రద్దు

జీజీహెచ్(కాకినాడ) ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): జనరల్ నర్సింగ్ అండ్ మిడ్ వైఫరీ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా గత నెల 29 న జరిగిన ఫౌండేషన్ ఆఫ్ నర్సింగ్ మొదటి సంవత్సర జీఎన్ఎం పరీక్షను రద్దు చేస్తున్నట్టు చీఫ్ సూపరిటెండెంట్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. రద్దు చేసిన పరీక్షకు బదులుగా ఈ నెల 2న మంగళవారం అదే పరీక్షను కాకినాడ ఆర్ఎంసీలో నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు మంగళవారం యూనిఫామ్ అలాగే హాల్‌టికెట్‌తో సహ ఆర్ఎంసీకి ఉదయం 9 గంటలకు హాజరుకావాలని డాక్టర్ లావణ్యకుమారి స్పష్టం చేశారు.

సఖినేటిపల్లి-నర్సాపురం రేవులో రాకపోకలు బంద్

అంతర్వేది, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి-నర్సాపురం రేవులో ఆదివారం పెరిగిన వరద కారణంగా రాకపోకలు బంద్ అయ్యాయి. పంట్లను పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం వైపు నిలిపివేశారు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి వశిష్ట గోదావరిలోకి 6లక్షల క్యూసెక్కుల నీరు విడుదల చేయడంతో నర్సాపురం వద్ద గోదావరి ఉగ్రరూపం దాల్చింది. లంక ప్రాంతాలకు వరద నీరు చేరడంతో స్థానికులు ఇక్కట్లకు గురవుతున్నారు. ప్రధానంగా చించినాడ బ్రిడ్జి మరమ్మతుల నేపథ్యంలో రాకపోకలకు అంతరాయం లేకపోయినప్పటికీ సఖినేటిపల్లి రేవు మీదుగా నర్సాపురం చేరుకునేవారు అత్యధికంగా ప్రయాణికులు ఉంటారు. అయితే వరద ఉధృతి పెరగడంతో సఖినేటిపల్లి రేవులో రాకపోకలు రెండు రోజుల పాటు నిలిపివేశారు.

దేవాలయ భూముల్లో వ్యవసాయ పనులు

చెట్లను తొలగించిన రైతులపై కేసు

కొత్తపల్లి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం గోర్స గ్రామానికి చెందిన శ్రీసీతారామస్వామి దేవాలయ భూముల్లో వ్యవసాయ పనులు చేపట్ట రాదని కోర్టు స్టే ఆర్డర్ ఉన్నప్పటికీ పనులు చేపట్టడమే కాకుండా గట్లపై ఉన్న చెట్లను అక్రమంగా తొలగించిన రైతులపై కొత్తపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. కొమరగిరిలో సర్వే నెం.121, 122లో గోర్స దేవాలయానికి సుమారు 20 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిని చాలాకాలంగా తామే సాగు చేస్తున్నామని ఆక్రమణదారులు, ఆ భూమి దేవుడిదేనని దేవాలయశాఖ మధ్య వివాదం కోర్టులో పెండింగ్‌లో ఉంది. కొన్నిరోజులు మౌనంగా ఉన్న రైతులు ఆదివారం దేవాలయానికి చెందిన భూముల్లో వ్యసాయపనులు చేపట్టారు. అంతటితో ఆగకుండా గట్లపై ఉన్న చెట్లను నరికించారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ రొంగల వీరబాబు తహశీల్దార్ జి.చిన్నారావుకు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాలతో వీఆర్వో కిషోర్ చెట్లను నరికిన, వ్యవసాయ పనులు చేపట్టిన వారిపై కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ వెంకటేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అడ్వకేట్ క్లర్క్స్ వెల్ఫేర్ సంఘ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బయ్య

కాకినాడ క్రైం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్రప్రదేశ్ అడ్వకేట్ క్లర్క్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం కాకినాడ బార్ అసోసియేషన్‌లో ఆదివారం నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఏలూరి సుబ్రహ్మణ్యం, చెక్కపల్లి చంటి, రాష్ట్ర నాయకులు ముప్పాళ్ళ సుబ్బారావు, నరహరిశెట్టి రవికృష్ణ హాజరయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు అంగులూరి సుబ్బయ్య మాట్లాడుతూ గుమస్తాల జీవన స్థితిగతులు దయనీయంగా ఉన్నాయని, ప్రభుత్వం తీసుకొచ్చిన 13/92 ఆంధ్రప్రదేశ్ అడ్వకేట్ క్లర్క్స్ వెల్ఫేర్ ఫండ్‌ను అమలుచేయడంలో ఉన్న లోపాలను తక్షణం సరిదిద్దాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా మరణానంతరం కుటుంబసభ్యులకు అందే ఆర్థిక సహా యం పెంచాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్ల భాస్కర్‌రావు మాట్లాడుతూ గుమస్తాల పిల్లల విద్య, కుటుంబ భద్రత కోసం ప్రత్యేక నిధి అవసరమన్నారు. గుమస్తాల సంక్షేమ నిధిని బలపర్చడం కోసం అందరు ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కాకినాడ బార్ అసోసియేషన్ నాయకులు గాదం సత్య ప్రభాకర్‌రావు, రాంబాబు, జీఎస్ఆర్ కృష్ణ, గోపి, సురేష్, సుధాకర్, నిరీక్షణరావు, నగేష్, సిరియల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అంతర్వేదిలో పవిత్రోత్సవాలు



శ్రీలక్ష్మీనరసింహస్వామివారు

అంతర్వేది, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన కోనసీమ జిల్లా అంతర్వేది పుణ్యక్షేత్రంలో శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో సోమవారం నుంచి గురువారం వరకు స్వామివారి పవిత్రోత్సవ మహోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఆలయ సహాయ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్ తెలిపారు. సోమవారం సాయంత్రం నుంచి అంకురార్పణ, ఆదివాసములు మొదలగు పూజాకార్యక్రమాలతో పవిత్రోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. మంగళ, బుధవారాల్లో అలంకార తిరుమంజనం, ప్రాయశ్చిత హోమాలు, పవిత్రాఅవరోహణ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. గురువారం అలంకార తిరుమ ంజనం, మహాశాంతి హోమం, మధ్యాహ్నం 12 గంటలకు పూర్ణాహుతి, సాయంత్రం 4 గంటలకు గ్రామోత్సవం, రాత్రి పవిత్ర అవరోహణ, విశేషార్చన, నీరాజన మంత్ర పుష్పములు, పవిత్రముల వినియోగం జరుగుతాయని తెలిపారు. ఆలయమంతా పుష్పాలంకరణ, విద్యుత్ అలంకరణతో తీర్చిదిద్ది మహాశాంతి హోమానికి తాత్కాలిక యాగశాల ఏర్పాటు చేశామన్నారు. దేశ, రాష్ట్ర ప్రజలకు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు కలగాలని, స్వామివారికి దివ్యతేజో ప్రకాశములు కలగాలని, సర్వప్రాయశ్చిత్యార్థం పవిత్రోత్సవాలు నిర్వహించబడతాయని ఆలయ ప్రధానార్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్ తెలిపారు.

7న మధ్యాహ్నం నుంచి దర్శనాలు నిలుపుదల

భాద్రపద పౌర్ణమి ఆదివారం రాత్రి 9.50 గంటలకు ప్రారంభమై రాత్రి 12.24 గంటలకు పూర్తి అయ్యే సంపూర్ణ చంద్రగ్రహణం సంభవించు సందర్భంగా అంతర్వేది పుణ్యక్షేత్రంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈనెల 7న ఆదివారం మధ్యాహ్నం 1 గంట నుంచి భక్తులకు దర్శనాలు నిలిపివేస్తారని ఏసీ ప్రసాద్ తెలిపారు. పునఃదర్శనాలు 8వ తేదీ సంప్రోక్షణ అనంతరం ఉదయం 8 గంటల నుంచి ఉంటాయని, ఆర్జిత అభిషేకం రద్దు చేయబడిందని పేర్కొన్నారు.

కొవ్వూరు ఉద్యాన పరిశోధనా కేంద్రానికి స్కోచ్ అవార్డు



కొవ్వూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయ అరటి రకాలను ఉత్పత్తి చేయడంలో జాతీయస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో కొవ్వూరు ఉద్యాన (అరటి) పరిశోధనా కేంద్రం స్కోచ్ అవార్డుకు ఎంపికైంది. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు పట్టణంలోని వేములూరు రోడ్‌లో ఉన్న డా.వైఎస్ఆర్ ఉద్యాన పరిశోధనా కేంద్రంలో సంప్రదాయ అరటి రకాల్లో నాణ్యమైన టిష్యూకల్చర్ మొక్కల ఉత్పత్తి చేయడంపై అవార్డుకు ఎంపికైనట్టు పరిశోధనా కేంద్రం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డా.డి.వెంకటస్వామి తెలిపా రు. ఇప్పటివరకు పరిశోధనా స్థానం నుంచి సుమారు 20 లక్షల టిష్యూకల్చర్ మొక్కలను ఉత్పత్తి చేయడం, మొట్టమొదటగా అరటిలో మగ పువ్వుల ద్వారా సంప్రదాయ అరటి రకాలైన తెల్ల చక్కెరకేళి, కర్పూర చక్కెరకేళి, అమృతపాణి, ఎర్ర చక్కెరకేళి, కర్పూరవల్లీ మొక్కలను అత్యధిక స్థాయిలో ఉత్పత్తి చేసి రైతుల అందించామన్నారు. ఈ అవార్డుకు సంబంధించి ఉద్యాన విభాగం సీనియర్ శాస్త్రవేత్త డా.కె.రవీంద్రకుమార్ 2025 ఏప్రిల్ నుంచి జూన్ వరకు వివిధ స్థాయిల్లో పాల్గొనడం జరిగిందన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సీటీకి 4 అవార్డులు వచ్చాయని, వాటిలో కొవ్వూరు పరిశోధన కేంద్రానికి స్కోచ్ అవార్డు రావడం ఆనందంగా ఉందన్నారు.

విద్యార్థినికి అధ్యాపకుడు అసభ్యకర మెసేజ్‌లు

● దేహశుద్ధి చేసిన కుటుంబసభ్యులు ● ఆలస్యంగా వెలుగులోకి సంఘటన

అన్నవరం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): అధ్యాపకుడి వ్యవహార శైలి కారణంగా విద్యార్థిని కుటుంబసభ్యులు దేహశుద్ధి చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సత్యదేవ డిగ్రీ కళాశాలలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న అధ్యాపకుడు డిగ్రీ ఫైనలియర్ చదువుతున్న విద్యార్థినిని నెలరోజులుగా వేధిస్తూ ఆమె ఫోన్‌కు అసభ్యకర మెసేజ్‌లు పంపడం, మానసికంగా వేధించడం, చెప్పినట్టు వినకపోతే పరీక్షల్లో తక్కువ మార్కులు వేస్తానని వేధించాడు. విద్యార్థిని కుటుంబసభ్యులకు చెప్పలేక మిన్నకుండిపోయింది. శనివారం కుటుంబసభ్యులు విద్యార్థిని ఫోన్‌లో మెసేజ్‌లు చూసి నిలదీయడంతో అసలు విషయం చెప్పింది. దీంతో కుటుంబసభ్యులు డిగ్రీ కళాశాలకు చేరుకుని అధ్యాపకుడికి దేహశుద్ధి చేయడంతో కళాశాల గోడ దూకి పరారయ్యాడు. ఈ విషయంపై పోలీసు కేసు పెడతామని కళాశాల ప్రిన్స్‌పాల్‌కు కుటుంబసభ్యులు తెలపడంతో అతడిపై చర్యలు తీసుకుంటామని చెప్పడంతో వారు వెనుతిరిగారు.

గిరిజన విద్యార్థిని మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి

రంపచోడవరం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా మారేడుమిల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థిని దివ్యతేజ మృతదేహానికి ఆదివాసం రంపచోడవరం ఏరియా ఆసుపత్రి వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. విద్యార్థిని మృతిపై ఇప్పటికే అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు పోస్టుమార్టంకు ముందు రక్త బంధువులు, పంచాయితీదార్ల సమక్షంలో శవపంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. శనివారం ఆదివాసీ నాయకులు, బంధువులు ఆందోళనతో మృతురాలి కుటుంబానికి న్యాయం చేసేందుకు ఐటీడీఏ ముందుకురావడంతో ఆందోళన విరమించిన సంగతి తెలిసిందే. దీంతో ఆదివారం శవపంచ నామా, పోస్టుమార్టం కార్యక్రమాలకు ఎటువంటి ఆటంకాలూ కలగలేదు. రంపచోడవరం డీఎస్పీ ప్రశాంతకుమార్ శనివారం ఆదివాసీ నాయకులు, బంధువులను సముదా యించి సమస్యను శాంతియుతంగా పరిష్కరిం పచేయడంలో కీలక పాత్ర పోషించి మృతురాలి కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రయత్నించారు.

విఘ్నేశుడికి వీడ్కోలు..



– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా విశేష పూజలందుకున్న గణపతి విగ్రహాలను తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం గోదావరిలో ఇలా నిమజ్జనం గావించారు.

అమలాపురం

వరద నీరు వెనక్కి రాకుండా చర్యలు

పి.గన్నవరం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): వరద ఉధృతి దృష్ట్యా గోదావరి నుంచి వరదనీరు వెనక్కి రాకుండా ముందస్తుగా ఏనుగుపల్లి, కతార్లంక, కె.ముంజవరం, వాకలగరువు, తొండవరం అవుట్ పాల్ స్లూయిస్‌లను మూసివేసినట్లు హెడ్‌వర్క్స్ జేఈ ఎ.దుర్గానాయుడు తెలిపారు. వరదలు తగ్గితే స్లూయిస్‌లు తెరుస్తామని చెప్పారు.

పెరుగుతోన్న గోదావరి వరద ఉధృతి

- లంకల్లో పడవలపై రాకపోకలు
- నిండుగా నదీపాయలు





మామిడికుదురు: కాజ్‌వే వద్ద ఇటుక బట్టీలను ముంచెత్తిన వరద, అల్లవరం: బోడసకుర్రు పల్లిపాలెంలో వరదలో మత్స్యకారుల ఇళ్లు, ఐ.పోలవరం: ఎదుర్లంక బ్రిడ్జి వద్ద వరద ఉధృతి

ముమ్మిడివరం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): గోదావరికి ఎగువన వరద ఉధృతంగా ప్రవహించడంతో దిగువన ఉన్న ముమ్మిడివరం మండలంలోని లంక గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల్లోకి వరదనీరు ప్రవేశించింది. గత నెల 21న గోదావరికి వరద ముంచెత్తడంతో మూడు రోజుల పాటు వరద నీటిలో లంక గ్రామాల ప్రజలు ఇబ్బంది పడ్డారు. వరద తగ్గింది అనేటప్పటికి మళ్లీ వారం తిరగకుండానే గోదావరికి వరద పోటెత్తడంతో లంక వాసులు ఇబ్బందులు పడుతున్నారు. పళ్లవారిపాలెం వివేకానంద వారధి నుంచి గురజాపులంక వెళ్లే సీసీ రోడ్డు గురజాపులంక వద్ద వరదనీరు ప్రవేశిస్తుంది. కూనాలంక, లంకాఫ్ ఠాణేలంక, గురజాపులంక, లంకాఫ్ గేదెల్లంకల్లో పల్లపు భూముల్లోకి వరద నీరు ప్రవేశించింది. లోతట్టు లంక భూములన్నీ వరదనీరు ప్రవేశిస్తోంది. నియోజకవర్గ ప్రత్యేకాధికారి ఎస్.మధుసూదన్, మండల ప్రత్యేకాధికారి పి.గౌతమ్, తహశీల్దార్ టి.సుభాష్‌లు లంక గ్రామాల్లో పర్యటించి అధికారులు, ప్రజలను అప్రమత్తం చేశారు. వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, మండలస్థాయి అధికారులు స్థానికంగా ఉండి పరిస్థితిని సమీక్షించాలని ఆదేశించారు. తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూము కొనసాగుతుంది. లంక గ్రామాల్లో రైతులు పొలాలకు వెళ్లేందుకు లంకాఫ్ ఠాణేలంక, గురజాపులంక వద్ద మెకనైజ్డ్ బోట్లు ఏర్పాటు చేశారు. లంక గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశారు. నియోజకవర్గంలోని తహశీల్దార్లు, మండలస్థాయి అధికారులతో నియోజకవర్గ ప్రత్యేకాధికారి ఎస్.మధుసూదన్ సమీక్షా సమావేశం నిర్వహించారు. వరద దృష్ట్యా తీసుకోవాల్సిన చర్యలపై సూచనలిచ్చారు. వరద తగ్గే వరకు అధికారులంతా అప్రమత్తంగా, రెవెన్యూ, విద్యుత్, వైద్య ఆరోగ్యశాఖ, ఫిషరీస్, ఐసీడీఎస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో తహశీల్దార్లు టి.సుభాష్, విజయశ్రీ, ఎంవీ.సుబ్బలక్ష్మిలతో పాటు పలువురు ఉన్నారు.

ఇబ్బందుల్లో లంక గ్రామాల ప్రజలు

మామిడికుదురు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): గోదావరికి ముచ్చటగా మూడోసారి వరద తీవ్రత పెరుగుతుండడంతో లంక గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అప్పనపల్లి కాజ్‌వేపై వరదనీరు చేరడంతో రాకపోకలను నిలిపివేశారు. పెదపట్నంలంక, అప్పనపల్లి, బి.దొడ్డవరం గ్రామాలతో పాటు బాలబాలాజీ దర్శనానికి భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. మూడోసారి వరద పోటెత్తడంతో లంక గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. తగ్గినట్టే తగ్గి మరలా వరద పెరగడంతో అపారనష్టం వాటిల్లుతుందని రైతులు బెంబేలెత్తుతున్నారు. పాశర్లపూడిబాడవలోని కనకదుర్గమ్మ ఆలయం వరద నీట మునిగింది. పల్లపు ప్రాంతాలు శ్రీరాంపేట, పల్లవపాలెం, మొల్లేటివారిపాలెం తదితర ప్రాంతాలు వరద నీట మునిగాయి.

ఉధృతంగా ప్రవహిస్తోన్న వైనతేయ

అంబాజీపేట, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): వైనతేయ గోదావరి పోటెత్తి ప్రవహిస్తోంది. మండలంలోని నదీతీర ప్రాంతాల్లోని వాణిజ్య పంటలు వరదనీటిలో చిక్కుకున్నాయి. నందంపూడి, వాకలగరువు, తొండవరం గ్రామాల్లో అరటి, కొబ్బరి, దొండ పాదులు నీటి మునిగాయి. గోదావరి సమీపంలో ఉన్న కౌశిక పొంగి ప్రవహించడంతో పలు కాలనీలు జలదిగ్బంధంలో ఉన్నాయి.

లంక గ్రామాలకు వరద ముప్పు

అల్లవరం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి వరద పెరిగి ఉప నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. వైనతేయ గోదావరికి మరలా వరద నీరు పోటెత్తింది. బోడసకుర్రు పల్లిపాలెంలో 30 మత్స్యకారుల నివాస గృహాలు వరద నీటిలో చిక్కుకున్నాయి. వరద ప్రాంతాల్లో వరద నీటితో పాములు కొట్టుకు వస్తున్నాయని భయాందోళన చెందుతున్నారు. వరద కారణంగా చేపల వేట నిలిచిపోయి మత్స్యకారులకు జీవనోపాధి ఇబ్బందిగా మారిందన్నారు. తహశీల్దార్ వీవీఎల్ నరసింహారావు ఎప్పటికప్పుడు వరద పరిస్థితిని సమీక్షిస్తున్నారు. గోపాయిలంక తదితర ప్రాంతాల్లో కొబ్బరి తోటల్లో వరద నీరు చుట్టుముట్టింది.

గోదావరి దోబూచులాట

పి.గన్నవరం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): గోదావరి కొన్ని రోజులుగా తగ్గుతూ.. పెరుగుతూ.. నిలకడగా ఉంటూ దోబూచులాడుతోంది. ఎగువన కురిసిన భారీ వర్షాలకు గోదావరిలో వరద ఉధృతి తగ్గడం లేదు. దిగువన ధవళేశ్వరం నుంచి సముద్రంలోకి 11.50లక్షల క్యూసెక్కుల వరదనీటిని వదులుతున్నారు. దీంతో జిల్లాలో ఉన్న వశిష్ఠ, వైనతేయ, గౌతమి, వృద్ధగౌతమి నదీపాయలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఇప్పటికే పలు కాజ్‌వేలు నీట మునగడంతో ఆదివారం నెమ్మదిగా లంకగ్రామాల్లోకి వరదనీరు చేరుకుంటుంది. నాగుల్లంక ఏటిగట్టు దిగువన సిమెంట్ రహదారిపైకి వరదనీరు చేరుకోవడంతో రాకపోకలు సాగించేందుకు లంకగ్రామస్తులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. మానేపల్లి శివారు శివాయిలంక రహదారిపైకి వరదనీరు రావడంతో రాకపోకలు సాగించడానికి అవస్థలు పడుతున్నారు. చాకలిపాలెం వద్ద కనకాయలంక కాజ్‌వే నీటమునగడంతో ఆప్రాంత వాసులు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. గంటిపెదపూడి, ఉడిమూడిలో పరిధిలో ఉన్న లంక గ్రామాల ప్రజలు, పశ్చిమగోదావరి జిల్లా పెదమల్లంక, అనగార్లంక, అయోధ్యలంక గ్రామస్తులు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. ప్రత్యేకాధికారి టి.జయచంద్రగాంధీ శివాయిలంక, కనకాయలంకలో పర్యటించి వరద పరిస్థితిని పరిశీలించారు. ముంపుపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆర్ఐ డాంగే, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు. చాకలిపాలెంలో పశ్చిమ గోదావరి జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులు ఆప్రాంత రైతులకు దాణా అందించారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

ఐ.పోలవరం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): గోదావరి వరదతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మురమళ్ల పుష్కరఘాట్‌ను వరదనీరు ముంచెత్తింది. యానాం-ఎదుర్లంక బ్రిడ్జి వద్ద వరదనీరు పోటెత్తింది. గోదావరి తీరం వెంబడి ఉన్న కొబ్బరితోటలు, లోతట్టు ప్రాంతాల్లో వరదనీరు చేరింది. బాహ్య ప్రపంచానికి దూరంగా ఉన్న గోగుల్లంక, భైరవలంక గ్రామాల ప్రజలు వరద ప్రభావంతో ఆందోళన చెందుతున్నారు. జి.మూలపొలం- పల్లంకుర్రు రేవులో ఆదివారం పడవ ప్రయాణాలు కొనసాగాయి. పడవ దాటింపులు నిలుపుదల చెయ్యాలని అధికారులు హెచ్చరించినప్పటికీ కాంట్రాక్టర్ పట్టించుకోలేదు. అన్నంపల్లి పాత, కొత్త అక్విడెక్టు వద్ద గోదావరి వరద నీరు పరవళ్లు తొక్కుతోంది. ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసిన నేపథ్యంలో గోదావరి తీరం వెంబడి ఉన్న లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికార యంత్రాంగం సూచించింది. పరిస్థితిని తహసీల్దార్ విజయశ్రీ పర్యవేక్షిస్తున్నారు.

ఘనంగా గణనాథులకు అభిషేకాలు.. నిమజ్జనాలు



పి.గన్నవరం: లంకలగన్నవరంలో గణనాథుడిని నిమజ్జనం చేస్తున్న దృశ్యం

అల్లవరం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రుల సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో 5వ రోజు ఆదివారం గణేష్ నిమజ్జనాలు జరిగాయి. మండలంలోని పలు గ్రామాల్లో గణపతి భక్తులు పందిళ్లలో గణనాథుల వద్ద భారీ లడ్డూలను ఏర్పాటు చేశారు. మొగళ్లమూరిలో వినాయక ఆలయం వద్ద గుంటూరి బాలరాజు, కాండ్రేగుల దత్తుడు ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. బోడసకుర్రుపాలెం మహిపతి కాలనీలో మూడు కిలోల గణపతి లడ్డూను రూ.8వేలకు ఓ భక్తుడు వేలం పాటలో దక్కించుకున్నాడు. బోడసకుర్రు పరిసర ప్రాంతాల నుంచి గణపతి విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చి వైనతేయ నదిలో నిమజ్జనం చేశారు. గోడికొత్తకాలనీలో వినాయకునికి పెన్నులతో పూజచేసి విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేశారు. కొమరగిరిపట్నం, బెండమూర్లంక, అల్లవరం, ఓడలరేవు, గుండెపూడి, మొగళ్లమూరి, గోపాయిలంక, డి.రావులపాలెం, దేవగుప్తం, గోడితిప్ప తదితర గ్రామాల్లో పందిళ్లలో గణనాథులకు కుంకుమ పూజలు ఘనంగా జరిగాయి.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): మామిడికుదురు సెంటర్‌లో శ్రీలక్ష్మీగణపతి వెల్ఫేర్ ఆటో అసోసియేషన్ వర్తకులు ఏర్పాటుచేసిన గణనాథుడికి లక్ష బత్తాయి పూజ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. భాగవతుల శర్మ, భాగవతుల లక్ష్మీనరసింహం ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీగణపతి హోమం, పూర్ణాహుతి, నీరాజన మంత్రపుష్పం, చతుర్వేద షష్ఠి, ఆశీర్వచనం తదితర పూజా కార్యక్రమాలను ఘనంగా చేశారు. రాత్రి జరిగిన అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మగటపల్లిలోని దొడ్డావారివీధిలో వేంచేసి ఉన్న శ్రీవరసిద్ధివినాయక స్వామికి చిన్నారులతో వినాయకపూజ, సరస్వతీ పూజ ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమం గోవిందవర్జుల మణీంద్రశర్మ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. పలుచోట్ల వివిధ రకాల పూజా కార్యక్రమాలు నిర్వహించి కొన్నిచోట్ల నిమజ్జనాలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో గణనాథుల నిమజ్జనాలు వైభవంగా జరిగాయి. లంకగన్నవరం శివారు వేమనవారిపాలెంలో శ్రీభద్రాద్రి చతుర్భుజ సీతారామస్వామి ఆలయ సన్నిధిలో ఏర్పాటుచేసిన ప్రత్యేక మండపంలో గణనాథుడిని ఘనంగా ఊరేగించారు. ఊరేగింపు అనంతరం కమిటీ సభ్యులు స్థానిక అక్విడెక్టుపై నుంచి స్వామివారిని వైనతేయ గోదావరిలో నిమజ్జనం చేశారు. మొండెపులంక, నాగుల్లంక, మానేపల్లి గ్రామాల్లో స్వామివారి నిమజ్జనాలు, అన్నసమారాధనలు నిర్వహించారు.

అంతర్వేది, (ఆంధ్రజ్యోతి): వినాయకుని మండపాల వద్ద సరస్వతీ పూజ, వ్యాసరచన పోటీలు వైభవంగా జరిగాయి. అంతర్వేది చెరువుగట్టు వద్ద వేంచేసి ఉన్న గణపతి, సుబ్రహ్మణ్య స్వామివారి ఆలయాల వద్ద ఏర్పాటుచేసిన గణేష్ మండపంలో 220మంది చిన్నారులు సరస్వతీ పూజలో పాల్గొని స్వామివారికి గరిక, విశేష అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. సరస్వతీ పూజలో పాల్గొన్న చిన్నారులకు పుస్తకం, పెన్నులు, పరీక్ష అట్టలు పంపిణీ చేశారు. అంతర్వేది వశిష్ఠ రేవు, సఖినేటిపల్లి, టేకిశెట్టిపాలెం తదితర ప్రాంతాల్లో వినాయక నిమజ్జన కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఆయా గణపతి మండపాల నిర్వాహకులు, పోలీసు బందోబస్తు మధ్య నిమజ్జనాలు జరిగాయి.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రులు సందర్భంగా ఆదివారం మండలంలోని వినాయక ఆలయాలు, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గణపతి పందిళ్లలో గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగలకుర్రు మలుపు వద్ద గణపతి ఆలయంలో ఆదివారం పెన్నుల పూజ నిర్వహించారు. గణపతికి అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. అలాగే పలు ఆలయాల వద్ద అన్నసమారాధనలు నిర్వహించారు.

సూపర్-6.. సూపర్ హిట్



అమలాపురంలో స్త్రీ శక్తి సభలో మాట్లాడుతున్న అయితాబత్తుల ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురంటౌన్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్-6 పథకాలను అమలు చేస్తూ సూపర్ హిట్ దిశగా ప్రభుత్వం ముందుకు దూసుకుపోతుందని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. మహిళలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు. అమలాపురం హౌసింగ్‌బోర్డు కాలనీలో ఆదివారం వందలాది మంది మహిళలతో స్త్రీశక్తి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సూపర్-6 పథకాలను హామీ మేరకు అమలుచేస్తున్నామన్నారు. తల్లికి వందనం, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, దీపం పథకం, మహిళలకు ఉచిత బస్సు పథకం, అన్నదాత సుఖీభవ పథకాలను ఇప్పటికే అమలు చేస్తున్నట్టు వివరించారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధికి ప్రాధాన్యతను ఇస్తూ చేపడుతున్న కార్యక్రమాలను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ అధికారి జయవెంకటలక్ష్మిలు వివరించారు. నియోజకవర్గం నలుమూలల నుంచి వందలాది మంది మహిళలు తరలివచ్చి స్త్రీశక్తి కార్యక్రమంలో పాల్గొన్నారు. సభలో రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు కడలి వెంకటేశ్వరరావు, కంకటాల రామం, ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొలమూరి ధర్మపాల్, నియోజకవర్గ పరిశీలకుడు పెచ్చెట్టి బాబు, మండల, పట్టణశాఖల అధ్యక్షుడు చొల్లంగి సత్యసాయిబాబా, అరిగెల నానాజీ, తిక్కిరెడ్డి నేతాజీ, దేవరపల్లి వీరేష్‌కుమార్, రోళ్లపాలెం పీఏసీఎస్ అధ్యక్షుడు మట్టా మహాలక్ష్మీప్రభాకర్, యేడిద శ్రీను, దంగేటి విజయగౌరీ, పెనుమాల సునతీ, కస్తూరి, చిట్టూరి రాజేశ్వరి, మంథా పణి తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మలికిపురం, సఖినేటిపల్లి మండలాల చిరుపవన్‌చరణ్ సేవా సమితి ఆధ్వర్యంలో మలికిపురం ఎల్ఎస్ ల్యాండ్‌మార్కు వద్ద పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వేడుకల్లో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా దేవ మాట్లాడుతూ సేవా సమితి సభ్యులు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అందరికీ ఆదర్శనీయమని సేవాసమితి సభ్యులను అభినందించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే దేవ, ఎల్ఎస్ ల్యాండ్ మార్క్ అధినేత లింగోలు పెద్దబ్బులు సంయుక్తంగా కేక్ కట్‌చేసి పవన్‌కల్యాణ్‌కు ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రక్తదానం చేసిన వారికి మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో లింగోలు పెద్దబ్బులు, గుండుబోగుల పెదకాపు, దిరిశాల బాలాజీ, ఎంపీపీ ఎంవీ సత్యవాణి, గుబ్బల ఫణి, తాడి మోహన్, ఆకన బాబ్జినాయుడు, ఎం.సత్తిబాబు, ఉండపల్లి అంజి, మేడిచర్ల రాము, రావి మురళీ, గెద్దం మహాలక్ష్మీప్రసాద్, గుబ్బల రవికిరణ్, బళ్ల రాము, నామన నాగభూషణం, యింటిపల్లి ఆనందరాజు తదితరులు పాల్గొన్నారు.

కాపు నేత నల్లా సూర్యచంద్రరావు వర్ధంతి



నల్లా సూర్యచంద్రరావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు తదితరులు

అమలాపురం టౌన్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): కాపు రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్ నల్లా సూర్యచంద్రరావు వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఆయన కుమారుడు నల్లా సంజయ్, అజయ్‌ల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పాల్గొని సూర్యచంద్రరావు విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆయనతో పాటు మాజీ మున్సిపల్ చైర్మన్ నల్లా విష్ణుమూర్తి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్‌కుమార్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, జనసేన నాయకుడు కల్వకొలను తాతాజీ పూలమాలలువేసి నివాళులర్పించారు. నల్లాగార్డెన్, మహిపాలవీధి, గండువీధుల్లో ఉన్న సూర్యచంద్రరావు విగ్రహాలకు ఘనంగా నివాళులర్పించారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించి రోగులకు పాలు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు యేడిద శ్రీను, ఆర్డీఎస్ ప్రసాద్, ఆశెట్టి ఆదిబాబు, దేశంశెట్టి లక్ష్మీనారాయణ, గోకరకొంగగంగన్నస్వామినాయుడు, అరిగెల నాని తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి): స్థానిక అక్విడెక్టు వద్ద స్థానిక నాయకులు నల్లా పెద్దకాపు అధ్యక్షతన ఆదివారం ఉద్యమ నేత నల్లా సూర్యచంద్రరావు వర్ధంతి నిర్వహించారు.. టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ నామన రాంబాబు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మీ, వివిధ పార్టీల నాయకులు సూర్యచంద్రరావు విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో శిరిగినీడి వెంకటేశ్వరరావు, అడబాల తాతకాపు, చొల్లంగి సత్యనారాయణమూర్తి, ఆరుమిల్లి సాయిబాబు, కోట రామ్మోహనరావు, అడ్డగళ్ల వెంకటసాయిరాం, నల్లా కిరణ్‌ప్రసాద్, ఆదిమూలం సూర్యకాపు, అరిగెల సూరిబాబు, చిట్టాల రామజోగేశ్వరరావు, కొక్కిరి రవికుమార్, అన్నాబత్తుల హనుమాన్, గనిశెట్టి ఈశ్వర్, నల్లా రాజారావు, తోలేటి సుబ్బారావు, దైవాల రాంబాబు, నల్లా సత్యనారాయణ, కర్రి బాబురావు, పుచ్చకాయల నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విజయబేతాళస్వామి సంఘ అధ్యక్షుడిగా పాపాయి



సంఘ అధ్యక్షుడిగా ఎన్నికైన పాపాయిని అభినందిస్తున్న సంఘీయులు

అమలాపురంరూరల్, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): పేరూరు తోట్లపాలెంలో శ్రీవిజయబేతాళస్వామి శెట్టిబలిజ సంఘ సర్వసభ్య సమావేశం సంఘ అధ్యక్షుడు బొంతు వీరవెంకటసత్యనారాయణ (పాపాయి) అధ్యక్షతన ఆదివారం జరిగింది. 500మందికిపైగా సంఘీయులు సమావేశంలో పాల్గొన్నారు. ఐదు దశాబ్దాలుగా అధ్యక్షుడిగా కొనసాగుతున్న పాపాయిని తిరిగి కొనసాగించాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. శ్రీవిజయబేతాళ స్వామి దసరా ఉత్సవాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని తీర్మానించారు. గౌరవాధ్యక్షుడిగా డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, సలహాదారునిగా న్యాయవాదులు కుడుపూడి అశోక్, చొల్లంగి సుబ్బరామ్, సభ్యులుగా యిళ్ల ఏడుకొండలు, మట్టపర్తి బాబి, యిళ్ల రాములను ఎన్నుకున్నారు.

రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

అమలాపురంటౌన్, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సెప్టెంబరు 2న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు పార్టీ నాయకులు వెల్లడించారు. అమలాపురం విద్యుత్ నగర్‌లోని ఐ.మైండ్స్ స్కూలు ప్రాంగణంలో ఉదయం 8నుంచి 3గంటల వరకు వైద్య శిబిరం జరుగుతుందని నిర్వాహకుడు ఆర్డీఎస్ ప్రసాద్ తెలిపారు. మెడ్ యునైటెడ్ ఆసుపత్రి సౌజన్యంతో నల్లా శ్రీధర్ సతీమణి నల్లా ఇంద్రాణి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో జనసేన, పవన్‌కల్యాణ్ అభిమాన సంఘాల సమన్వయంతో ఉచిత వైద్య శిబిరం జరుగుతుందన్నారు. కేన్సర్, గుండె సంబంధిత, గర్భ సంబంధిత వ్యాధులపై వైద్య నిపుణులు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అల్ట్రాసౌండ్‌తో పాటు డిజిటల్ ఎక్సరే వంటి వైద్య పరీక్షలు అందుబాటులో ఉంటాయన్నారు. వివరాలకు సెల్:8978777888ను సంప్రదించాలన్నారు.

ఇంటర్మీడియట్ పెన్షనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

అమలాపురంటౌన్, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ఈసందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడిగా పీవీవీ సత్యనారాయణ, సలహాకమిటీ సభ్యుడిగా జి.బలభద్రశర్మ, అధ్యక్షుడిగా కోలా వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా బి.చంద్రరావు, ఉపాధ్యక్షుడిగా సీహెచ్ సత్యనారాయణమూర్తి, సంయుక్త కార్యదర్శిగా గంజి అనంతరం, కోశాధికారిగా కేవీఎస్‌వీఎస్ సాయిరామ్, మహిళా కార్యదర్శిగా జె.ఈశ్వరీదేవి, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా బి.విష్ణుమూర్తి, సంసాని వెంకటబంగారంను ఎన్నుకున్నారు. పీఆర్సీ బకాయిలు, పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు తదితర అంశాలపై చర్చించారు. ఈపీఎస్95లో పెన్షన్ పొందుతున్న 3లక్షల మందికి కనీసం పెన్షన్‌గా రూ.4వేలుఅందించాలన్నారు. నూతనకార్యవర్గాన్ని ఇంటర్మీడియట్ జిల్లా విద్యాధికారి వనుము సోమశేఖరరావు ముఖ్య అతిథులుగా హాజరైన పాకా చంద్రరావు, కేపీ జగదీశ్వరరావులు సత్కరించిఅభినందించారు.

గణపతి పందిళ్ల వద్ద భద్రత ఏర్పాటు చేసుకోవాలి: సీఐ

అంబాజీపేట, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): గణపతి మందిరాల వద్ద భద్రత ఏర్పాటు చేసుకోవాలని సీఐ ఆర్.భీమరాజు సూచించారు. ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు డీఎస్పీ సుంకర మురళీమోహన్ పర్యవేక్షణలో గణపతి నిమజ్జనం సమయంలో చేపట్టాల్సిన జాగ్రత్తలను సీఐ ఉత్సవ కమిటీలకు వివరించారు. గోదావరి ఉధృతంగా ఉన్న దృష్ట్యా భక్తులు జాగ్రత్తలు పాటించాలన్నారు. చెరువులు, కాలువల వద్ద భక్తులు జారి పడే ప్రమాదం ఉన్నందున తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. అధికారులు నిర్దేశించిన ప్రాంతాల్లోనే నిమజ్జనాలు నిర్వహించాలని సూచించారు. ఊరేగింపులో డీజేలకు అనుమతి లేదన్నారు. ఎస్ఐ కె.చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రోమోర్ వద్ద రైతుల ఆందోళన

ఐ.పోలవరం, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): ఐ.పోలవరంగ్రోమోర్ వద్ద రైతులు ఆదివారం ఆందోళనకు దిగారు. యూరియా విక్రయాల్లో గ్రోమోర్ సిబ్బంది ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ ఆ ప్రాంత రైతులు ఆందోళన చేశారు. నీటిసంఘాల ప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు గ్రోమోర్ సిబ్బందితో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించారు. 90బస్తాల యూరియాను రైతులకు విక్రయించడంతో సమస్య పరిష్కారమైంది.

గోదావరిలో దూకుతున్న మహిళను రక్షించిన కానిస్టేబుల్

ఐ.పోలవరం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): యానాం గోపాల్‌నగర్‌కు చెందిన మహిళ కుటుంబ కలహాల నేపథ్యంలో ఆదివారం యానాం-ఎదుర్లంక బ్రిడ్జిపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించింది. ఆ సమయంలో అటుగా వెళ్తున్న ఎస్పీ కానిస్టేబుల్ నాగరాజు మరో నలుగురితో కలిసి క్షణాల్లో ఆమె చేయిపట్టుకుని రక్షించాడు. భార్యాభర్తల వివాదం కారణంగానే ఆమె ఆత్మహత్యకు ప్రయత్నించినట్టు పోలీసులు గుర్తించారు. ఆ మహిళకు కౌన్సిలింగ్ ఇచ్చి బంధువులకు అప్పగించినట్టు నాగరాజు తెలిపారు.

ఆకట్టుకున్న కోలాటం

ఉప్పలగుప్తం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేస్తున్నట్టు గొల్లవిల్లి గ్రామస్తులు వ్యాఖ్యానించారు. గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శనివారం రాత్రి వినాయక ఉత్సవ పందిరిలో హరే శ్రీనివాసం ప్రత్యేకమురళీ కోలాటం ప్రదర్శించారు. టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో వివిధ జిల్లాలకు చెందిన వందమంది కళాకారిణులు ఈప్రదర్శనలో పాల్గొన్నారు. స్థానిక భీమేశ్వరా కోలాట భజన బృందం కూడా ఈప్రదర్శనలో పాల్గొంది. ఆధునిక సమాజంలో మహిళలు భారతీయ సంస్కృతి, ఆచార, సంప్రదాయాలను పాటించాలంటూ ప్రబోధాత్మక గీతాలతో కోలాటం ఆకట్టుకుంది. కోలాటగురువుఈశ్వర్‌ను గ్రామస్తులుసన్మానించారు.

'104లో అక్రమ బదిలీలు ఆపాలి'

అమలాపురం టౌన్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): వైద్య సేవలు అందించడంలో ముందుంటున్న 104అంబులెన్సు సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరామ్ ఆరోపించారు. పేదల ముంగింటకు వైద్య సేవలు అందించడంలో 104ముందుంటుందన్నారు. 104సిబ్బందిని అక్రమంగా బదిలీ చేస్తున్నారని ధ్వజమెత్తారు. 104ఉద్యోగుల జిల్లా కమిటీ సమావేశం ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో బలరామ్ అధ్యక్షతన నిర్వహించారు. ఉద్యోగులకు బకాయి జీతాలు చెల్లించడంతో పాటు పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అధ్యక్షుడు ఎస్.సతీష్, ప్రధాన కార్యదర్శి జగ్జీవన్‌రామ్, కోశాధికారి ఆనంద్, వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు వనచర్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాల గణపతికి కలములతో పూజ



విద్యార్థినికి తల్లితో కలిసి ప్రతిభా పురస్కారం అందిస్తున్న దృశ్యం

అమలాపురం రూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): జనుపల్లి పెద్దవీధిలో శ్రీబాలగణపతి యువజన సంఘం ఆధ్వర్యంలో నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం బాలగణపతి స్వామికి కలముల పూజ నిర్వహించారు. గ్రామంలో పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో అత్యధిక మార్కులతో ప్రథమ స్థానం సాధించిన గుబ్బల వరలక్ష్మి, కోడూరి భవ్యఅనూషలక్ష్మిలకు గణపతి ప్రతిభా పురస్కారంతో పాటు నగదు బహుమతి అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ గానాల భారతి, ఎంపీటీసీ పోలిశెట్టి మంగతాయారు, సభ్యులు కర్రి లక్ష్మీదుర్గా, తటవర్తి జగన్నాదం, తటవర్తి సూర్యనారాయణ, తటవర్తి మల్లికార్జునరావు, వేమన సూరిబాబు, వాకపల్లి వెంకన్ననాయుడు, పోలిశెట్టి బాబు తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి తూర తొలగింపు

అయినవిల్లి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): సిరిపల్లి-మాగాం పంటకాల్వలో సాగునీరు అందించే తూరను నీటిపారుదల శాఖ అధికారులు తొలగించారని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తొత్తరమూడి గ్రామానికి చెందిన రైతు కడలి వెంకటసత్యనారాయణ సిరిపల్లిలో వరి వ్యవసాయం చేస్తుండగా, నీటి పారుదలశాఖ అధికారులు తూర తీసివేయడం వల్ల పంటచేనుకు నీరులేక ఎండిపోతుందని ఆవేదన వ్యక్తంచేశారు. అధికారులు తూరను పునరుద్ధరించి సాగునీరు కల్పించాలని కోరుతున్నారు.

మలికిపురం-మోరి రోడ్డుకు మరమ్మతులు

మలికిపురం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మలికిపురం-మోరి రోడ్డు అధ్వానంగా మారడంతో కూటమి నాయకుల ఆధ్వర్యంలో మరమ్మతులు చేపట్టారు. రోడ్డు పరిధిలోని వీవీమెరక, మోరి సరిహద్దుల్లో రోడ్లపై పెద్దపెద్ద గుంతలు పడడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. కూటమి నాయకులు ఆర్అండ్‌బీ అధికారులతో కలిసి గోతులు పూడ్చడానికి మరమ్మతులు చేపట్టారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సఖినేటిపల్లి మండల అధ్యక్షుడు ముప్పర్తి నాని, వీవీమెరక సొసైటీ అధ్యక్షుడు వీరా రామారావు, జాన పార్వతీశం, ముప్పర్తి సత్యశ్రీనివాస్, ఆకుల వాసు, యెనుముల శ్రీధర్, పిండి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పవన్ పుట్టినరోజున సేవా కార్యక్రమాలు చేపట్టండి

అంబాజీపేట, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా ప్రజాపయోగ పనులు చేపట్టాలని జనసేన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక కొర్లపాటివారిపాలెంలో ఆదివారం పార్టీ మండలాధ్యక్షుడు దొమ్మేటి సాయికృష్ణ అధ్యక్షతన నిర్వహించిన పార్టీ మండల శాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు అరిగెల సూరిబాబు, కొర్లపాటి గోపి, మైపాల తాతాజీ, వక్కపట్ల సుబ్రహ్మణ్యం, నేదునూరి పెద్దిరాజు, బండారు అబ్బులు, సుదాబత్తుల రవి, అరిగెల బుజ్జి పాల్గొన్నారు.

ఉధృతంగా గోదావరి వరద ప్రవాహం

యానాం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): యానాంలో వరద ప్రవాహం ఉధృతంగా కొనసాగుతోంది. ఎగువన కురుస్తున వర్షాలకు గోదావరికి వరద నీరు పోటెత్తడంతో యానాం జీఎంసీ బాలయోగి వారధి వద్ద వరద ప్రవాహం ఉధృతంగా ప్రవహిస్తోంది. ధవళేశ్వరం నుంచి లక్షల క్యూసెక్కుల వరదనీరు సముద్రంలోకి వదలడంతో యానాం గౌతమి గోదావరి మీదుగా వరద సముద్రంలోకి చేరుతోంది. యానాం రాజీవ్‌గాంధీ బీచ్‌లోని పలు పర్యాటక కట్టడాలు, పర్యాటక కేంద్రాలు వరద ముంపునకు గురయ్యాయి. పరిపాలనాధికారి మునిస్వామి వరద పరిస్థితిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ముంపు ప్రాంతాలను పరిశీలించారు.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

ముమ్మిడివరం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన ముమ్మిడివరం మండలం కొత్తలంకకు చెందిన పత్సమట్ల ఫణివర్మ(55) మృతదేహం రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్ సమీపంలో రైల్వే పోలీసులకు లభ్యమైంది. ఫణివర్మ కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడని, ఆ మనస్తాపంతోనే ఆత్మహత్య చేసుకుని ఉంటాడని ఎస్ఐ డి.జ్వాలాసాగర్ తెలిపారు. ఫణివర్మకు భార్య, పిల్లలు లేకపోవడంతో ఒంటరిగానే జీవిస్తున్నాడు. గతనెల 29న ఇంటి నుంచి వెళ్లిన ఫణివర్మ అదేరోజు రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాలపై ఆత్మహత్యకు పాల్పడినట్టు ఎస్ఐ తెలిపారు.

వినాయకునికి లక్ష గరిక పూజ

రాజోలు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రాజోలు కంటిఆసుపత్రి వీధిలో ఏర్పాటుచేసిన వినాయకుని మండపంలో వేదపండితులు పార్వతీ దీక్షితులు, ఫణికుమార్ ఆధ్వర్యంలో గణపతికి లక్ష గరికపూజ, వెయ్యి పెన్నులతో ఆదివారం సరస్వతీపూజ నిర్వహించారు. మహిళలు, విద్యార్థులు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలుచేశారు. డాక్టర్ సూర్యనారాయణమూర్తి, సత్తిరాజు సోమేశ్వరరావు, వెంకటేశ్వర్లు, స్వామి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా డీటీ రాత పరీక్ష

యానాం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి రెవెన్యూ శాఖలో ఖాళీగా ఉన్న డిప్యూటీ తహశీల్దార్(డీటీ) పోస్టులకు సంబంధించి ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా రాత పరీక్ష ప్రశాంతంగా జరిగింది. యానాంలో 1,953మందికి 1,547మంది పరీక్షకు హాజరయ్యారు. యానాంలో ఆరు పరీక్ష కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. రెండు విభాగాల్లో ఉదయం 10నుంచి 12గంటల వరకు, 2.30గంటల నుంచి 4.30గంటల వరకు జరిగింది. పరీక్షల నిర్వహణను పరిపాలనాధికారి మునిస్వామి, పుదుచ్చేరి నుంచి వచ్చిన అధికారుల బృందం పర్యవేక్షించారు. పరీక్షకు 2నిమిషాలు ఆలస్యంగా రావడంతో నలుగురు అభ్యర్థులను అనుమతించలేదు. దీంతో వారుఆవేదన వ్యక్తం చేశారు.

బాధ్యతగా పనిచేస్తే ప్రభుత్వ గుర్తింపు: డీఎస్పీ

అల్లవరం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): పోలీసుశాఖలో ఉద్యోగులు బాధ్యతగా పనిచేస్తే ప్రభుత్వ గుర్తింపుతో పాటు ప్రజల్లో మంచి పేరు వస్తుందని అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ అన్నారు. అల్లవరం గుడ్డివానిచింత వద్ద సత్యకస్తూరి కల్యాణ మండపంలో డీసీఆర్బీ ఎస్ఐగా ఉద్యోగ విరమణ చేసిన జంగా సత్యనారాయణ సన్మాన సభలో ఆయన ప్రసంగించారు. డీసీఆర్బీ ఎస్ఐ సత్యనారాయణ సేవలు ఆదర్శనీయమని పలువురు వక్తలు ప్రసంగించారు. సత్యనారాయణ-శైలజ దంపతులకు దుశ్శాలువాలు కప్పి సన్మానించారు. రూరల్ సీఐ డి.ప్రశాంత్‌కుమార్, టౌన్ సీఐ పి.వీరబాబు, అల్లవరం, ఉప్పలగుప్తం, అమలాపురం ఎస్ఐలు బి.సంపత్‌కుమార్, రాజేష్, శేఖర్‌బాబు, కిశోర్‌బాబు, శ్రీనివాసరావు, గుబ్బల రామ్‌ప్రసాద్, సర్పంచ్ దాకరపు చిరంజీవి, కంకిపాటి వీరబాబు, కంకిపాటి గోపి పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే మహిళాభ్యున్నతి

స్త్రీశక్తి విజయోత్సవ సభలో మంత్రి సుభాష్



విజయోత్సవ సభలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

ద్రాక్షారామ, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే మహిళాభ్యున్నతి జరుగుతుందని మంత్రి సుభాష్ అన్నారు. ఆదివారం ద్రాక్షారామలో శ్రీభీమేశ్వరస్వామి వసతిగృహ సముదాయంలో స్త్రీశక్తి పథకం విజయోత్సవ సభ నిర్వహించారు. సభలో మంత్రి సుభాష్ మాట్లాడుతూ మహిళా స్వాలంబనను దృష్టిలో ఉంచుకుని సూపర్ సిక్స్ పథకాలు అమలు చేశారన్నారు. మహిళలకు అమలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణానికి నెలకు రూ.162 కోట్లు చొప్పున ఏడాదికి రూ.1,942 కోట్ల రూపాయల భారం పడుతుందన్నారు. అధికారం చేపట్టిన కొద్దికాలంలోనే 90 శాతం హామీలను అమలు చేశామన్నారు. స్త్రీ శక్తి పథకం అమలుతో ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణీకుల సంఖ్య 40 శాతం నుంచి 67 శాతానికి పెరిగిందన్నారు. రోజుకు సగటున 25 లక్షల మంది మహిళలు, బాలికలు బస్సు ప్రయాణం చేస్తున్నారన్నారు. సభలో రామచంద్రపురం మార్కెట్ కమిటీ ఛైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, నియోజకవర్గ పరిశీలకుడు కాకినాడ రామారావు, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఛైర్మన్ వాసంశెట్టి సత్యం, టీడీపీ మహిళా నాయకులు జాస్తి విజయలక్ష్మీ, వైట్ల గజలక్ష్మీ, బళ్ల లక్ష్మీ, సర్పంచ్ కొత్తపల్లి అరుణ, మహిళలు పాల్గొన్నారు. అనంతరం సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

కూటమి ప్రభుత్వంలో సూపర్ సిక్స్ సక్సెస్

విజయోత్సవ సభలో ఎమ్మెల్యే వేగుళ్ల



మండపేటలో మహిళలనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. రాష్ట్రంలో సూపర్ సిక్స్ పథకాల అమలు, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం నేపథ్యంలో ఆదివారం మహిళామణులతో విజయోత్సవ సభ నిర్వహించారు. ఎమ్మెల్యే సారధ్యంలో మండపేట బస్టాండ్ వద్ద నిర్వహించిన విజయోత్సవ సభకు నియోజకవర్గం నుంచి వచ్చిన మహిళలతో సభా ప్రాంగణం కిక్కిరిసింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు ప్రభుత్వ పథకాలను గురించి వివరించి సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్, మంత్రి లోకేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉచిత బస్ ప్రయాణం రాష్ట్రమంతా కల్పించటం వల్ల మహిళలకు ఎంతో మేలు జరిగిందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతోపాటు మహిళలకు అందిస్తున్న ఆయా పథకాలను వేగుళ్ల వివరించారు. సభలో పలువురు మహిళలు, ప్రజాప్రతినిధులు మాట్లాడారు. అనంతరం బస్టాండ్ నుంచి మహిళలు ర్యాలీగా మెయిన్ రోడ్డు మీదుగా ఎన్‌టీఆర్ సెంటరుకు చేరుకున్నారు. అక్కడ ఎన్‌టీఆర్ విగ్రహంతోపాటు సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఏపీఐడీసీ ఛైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ, మాజీ మున్సిపల్ ఛైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ రెడ్డి ప్రసాద్, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ ఛైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, మాజీ ఎంపీపీ నెక్కంటి శ్రీరామ్‌జీ, గోసాల సుజాత, తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ గడి సత్యవతి, మున్సిపల్ కౌన్సిలర్‌లు, కాళ్లకూరి స్వరాజ్య భవాని, శిరంగు జ్యోతి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనాలకు రేవుల భద్రతపై సమగ్ర సర్వే



ఆలమూరు మండలం బడుగువానిలంక వద్ద గోదావరి రేవును పరిశీలిస్తున్న ఎస్ఐ నరేష్

ఆలమూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలంలో వినాయక నవరాత్రుల అనంతరం జరిగే నిమజ్జనాలకు ఆలమూరు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఆదివారం నుంచి ప్రారంభమైన గణేష్ నిమజ్జనాల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఆలమూరు ఎస్ఐ జి.నరేష్ అధ్వర్యంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఆలమూరు మండలంలో నిమజ్జనాలు జరిగే మడికి, చెముడులంక, జొన్నాడ, ఆలమూరు కాలవ రేవులు, జొన్నాడ, బడుగువానిలంక వద్ద గోదావరిలో జరిగే ఘాట్‌ల వద్ద పరిశీలించారు. రేవుల వద్ద విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఆలమూరు, మడికి గ్రామాల్లో ఆదివారం ఐదో రోజు వినాయక నిమజ్జనాలు చేశారు.

ఘనంగా వినాయక నిమజ్జనం

ఆత్రేయపురం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వేడుకల్లో భాగంగా ఆదివారం వినాయకుని నిమజ్జనాన్ని యువత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉచ్చిలికి చెందిన యువకులు వినాయకుని విగ్రహాన్ని ఊరేగిస్తూ ప్రధాన పంట కాలువలో నిమజ్జనం చేశారు



ఆత్రేయపురం మండలం ఉచ్చిలి ప్రధాన కాలువ వద్ద యువత సందడి



ఆలమూరులో వలస కార్మికులకు ఫుడ్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

వలస కార్మికులకు ఫుడ్ ప్యాకెట్లు పంపిణీ

ఆలమూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఆలమూరు న్యాయస్థానం ఏజీపీ బూసి విద్యా ప్రసన్న అధ్వర్యంలో నడుస్తున్న ఉమన్ డెవలప్‌మెంట్ ట్రస్టు ద్వారా ఆదివారం ఆలమూరులో వలస కార్మికులకు ఫుడ్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఉమెన్ ట్రస్టు అధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాల నిర్వహణలో భాగంగా మండలంలోని ఆలమూరు, పినపళ్ల గ్రామాల్లో ఇటుకబట్టీలలో పనిచేయడానికి వచ్చిన పలువురు వలస కార్మికులకు ఆదివారం మధ్యాహ్నం 50 మందికి ఫుడ్ ప్యాకెట్లను అందించారు. కార్యక్రమంలో నాయకులు వెర్రియ్య, కేతా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 32 మంది ఎంపిక

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉపాధి కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన జాబ్‌మేళాలో 32 మంది ఆయా ఉద్యోగాల్లో ఎంపికయ్యారు. వారికి ఉపాధి కార్యాలయం ప్రాజెక్టు డైరెక్టరు రామ్‌కుమార్ నియామక పత్రాలు అందచేశారు.



కె.గంగవరం మండలం కోటిపల్లి పుష్కరాల రేవులో పై మెట్ల వరకు చేరుకున్న వరద నీరు



ఆలమూరు వద్ద ఎగువన వస్తున్న వరదతో పోటెత్తుతున్న గోదావరి వరద



రావులపాలెం మండలం గోపాలపురం వశిష్ట వంతెన వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

గోదావరి ఉధృతితో మళ్లీ కలవరం

• ముంపునకు గురవుతున్న లోతట్టు ప్రాంతాలు • వరద ముంపులో పలు వాణిజ్య పంటలు • ఆందోళనలో లంకప్రాంత రైతులు

కె.గంగవరం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదనీటితో కోటిపల్లి వద్ద గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తున్నది. స్థానిక పుష్కరాల రేవులో పైమెట్ల వరకూ వరదనీరు చేరుకుంది. ఫెర్రీ రేవులో వరదనీరు చేరింది. కోటిపల్లి లంక పొలాలు వరదనీటిలో చిక్కుకున్నాయి. ఇటీవల తగ్గుముఖం పట్టిన గోదావరి ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదనీటితో మళ్లీ పెరుగుతోంది. మరో మూడు అడుగులు పెరిగితే కోటిపల్లి రేవులోని రోడ్డుపైకి నీరు చేరే అవకాశం ఉందని స్థానికులంటున్నారు.

నీటమునిగిన పంటలు

ఆలమూరు, (ఆంధ్రజ్యోతి): గోదావరి వరద మరోసారి తన ఉగ్రరూపాన్ని చూపుతోంది. గోదావరి ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదతో ఆలమూరు మండలంలో ఆయా లంక భూముల్లోకి వరద నీరు చేరుకుంది. వరద ఉధృతి కారణంగా మండలంలోని బడుగువాని లంక, మడికి, చెముడులంక, చొప్పెల్ల, మూలస్థానం, జొన్నాడ, ఆలమూరు లంకతో పాటు ఆయా లోతట్టు ప్రాంతాల్లోని వాణిజ్య పంటలు నీటమునిగాయి. వరద నీరు అధికంగా ప్రవహిస్తుండటంతో ఆలమూరు మండ లం మూలస్థానానికి అనుకొని ఉన్న రావులపాలెం మండలం ఊబలంక పంచాయతీకి చెందిన తోకలంక వరదనీటిలో కొనసాగుతోంది. మూలస్థానం వద్ద ఉన్న కాజ్‌వే పది రోజుల క్రితం వచ్చిన వరదలకు కొట్టుకుపోవడంతో మూలస్థానం లంక రైతులకు, తోకలంక ప్రజలకు ఇబ్బందిగా మారింది. తోకలంకకు వెళ్లడానికి పడవలపై ప్రయాణించాల్సి వస్తు న్నది. మండలంలోని జొన్నాడ వద్ద వరద నీటికి పుష్కర్ ఘాట్ పూర్తిగా నీటమునిగింది. జొన్నాడ రెండు వంతెనల మధ్య వరద నీరు ఉధృతంగా ప్రవాహిస్తున్నది.

రావులపాలెం, (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వస్తున్న వరదతో మండలంలోని గౌతమి, వశిష్ట పాయల్లో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తున్నది. దీంతో నదీ పరివాహక ప్రాంత లంక పొలాలు ముంపునీటిలో చిక్కుకుంటున్నాయి. ఊబలంక శివారు తోకలంక జలదిగ్బంధంలో చిక్కుకోవడంతో ఆ ప్రాంతానికి రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు ముందస్తు జాగ్రత్తలో భాగంగా ఆ ప్రాంత వాసులకు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీచేశారు.

ఘాట్లపై ప్రవహిస్తున్న వరదనీరు

కపిలేశ్వరపురం, (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల నుంచి వరద ఉధృతికి నదీపరివాహక ప్రాంతాలైన తాతపూడి, కపిలేశ్వరపురం, కోరుమిల్లి, కేదార్లంక, వీధివారిలంక, నారాయణలంక, పల్లపులంక, అద్దంకివారి లంక గ్రామాల ప్రజలు బెంబేలెత్తుతున్నారు. పలుచోట్ల లంకపొలాల్లోకి వరదనీరు చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటుక బట్టీలకు వరద నీరు చేరింది. వరద ఉధృతి కారణంగా కపిలేశ్వరపురం, కోరుమిల్లి, తాతపూడి పుష్కరఘాట్లపై నుంచి వరద నీరు ప్రవహిస్తున్నది. లంక గ్రామాల్లో ముంపునకు గురైన పంటలు ఇటీవల తేరుకోగా ప్రస్తుత వరద ఉధృతి కారణంగా అరటి, కొబ్బరి, మొక్కజొన్న, కూరగాయలు తదితర పంటలకు నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. వరద పరిస్థితులను రెవెన్యూ, పోలీస్, పంచాయతీ సిబ్బంది పర్యవేక్షిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.



కపిలేశ్వరపురం మండలం కేదార్లంకలో వరద పరిస్థితి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొత్తపేట, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ముక్కామల, మోడేకుర్రు 11కేవీ ఫీడర్‌లో చెట్టుకొమ్మలు తొలగించే నిమిత్తం మోడేకుర్రు, గొలకోటివారిపాలెం, పితానివారిపాలెం, రాకుర్తివారిపాలెం, చిరతపూడి గ్రామాలకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ కె.రాంబాబు కోరారు.

పేకాట శిబిరంపై దాడి

మండపేట, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): పేకాట శిబిరంపై దాడిచేసి పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నామని పట్టణ సీఐ సురేష్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలోని కొండపల్లి వీధిలో పేకాడుతున్నారని సమాచారం రావటంతో దాడి చేయగా 10 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. ఈ దాడిలో వారి నుంచి రూ.65,500 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.



రిసోర్స్‌పర్సన్ ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న ఉపాధ్యాయుడు

ఉపాధ్యాయుడి ఎంపిక పట్ల పలువురు హర్షం

ఆలమూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష రాష్ట్ర రిసోర్స్‌పర్సన్‌గా చింతలూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం వుడతా వెంకటేశ్వరరావును ఎంపిక చేశారు. విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి వర్క్‌షాపులో ఆయనకు రాష్ట్రస్థాయిలో ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. రాష్ట్రస్థాయి లో 42మంది ఉపాధ్యాయులను ఎంపిక చేయగా కోనసీమ నుంచి ఇద్దరు ఉపాధ్యాయులను ఎంపిక చేసినట్టు ప్రశంసాపత్రం స్వీకరించిన వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన్ను పలువురు అభినందించారు.

డ్రోన్ల వినియోగంతో రైతులకు ఎంతో మేలు

మంత్రి సుభాష్



రైతులకు డ్రోన్లు అందజేస్తున్న మంత్రి సుభాష్

ద్రాక్షారామ, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): డ్రోన్ల వినియోగం వ్యవసాయ యాంత్రీకరణలో ముందడుగని, డ్రోన్ల వినియోగం రైతులకు శ్రేయస్కరమని మంత్రి సుభాష్ అన్నారు. ఆదివారం ద్రాక్షారామలో వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో రామచంద్రపురం, కె.గంగవరం మండలాలకు చెందిన 7 రైతుల గ్రూపులకు డ్రోన్లు మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ డ్రోన్ల వినియోగంతో పెట్టుబడి ఖర్చులు, శ్రమను తగ్గించడం తద్వారా పంట దిగుబడి పెంచడానికి దోహదపడుతుందన్నారు. డ్రోన్లు రూ.68.60 లక్షలు కాగా అందులో రూ.54.88 లక్షలు సబ్సిడీ అందించామన్నారు. డ్రోన్ల వినియోగంలో పైలట్లకు ఇప్పటికే 15 రోజులు శిక్షణ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్, సర్పంచ్ కొత్తపల్లి అరుణ, వ్యవసాయశాఖ ఏడి నాగకుమార్, మండల వ్యవసాయాధికారులు టీవీఆర్ మణిదీప్, పలువురు రైతులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



కూళ్ల గ్రామంలో సరస్వతీదేవి పూజ చేస్తున్న విద్యార్థులు

కూళ్ల, పామర్రు గ్రామాల్లో...

గణపతి మండపాల్లో సరస్వతీదేవి పూజ

కె.గంగవరం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో గణపతి నవరాత్రులు ఘనంగా కొనసాగుతున్నాయి. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణపతి మండపాల్లో అధిక సంఖ్యలో భక్తులు పూజలు చేస్తున్నారు. కూళ్ల మెయిన్ రోడ్డు, పామర్రు కాపుల కాలనీలోని దుర్గమ్మ ఆలయం వద్ద గణపతి మండపాల్లో ఆదివారం విద్యార్థులు సరస్వతీదేవి పూజ చేశారు. కూళ్ల గ్రామంలో జరిగిన పూజలో పాల్గొన్న విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, ప్రసాదం పంపిణీ చేశారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా మండప నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

కుందూరు పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కె.గంగవరం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): కుందూరు ఉన్నత పాఠశాలలో 2005-2006 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు సందడి చేశారు. వారంతా పాఠశాలకు చేరుకుని అప్పటి సంగతులు గుర్తు చేసుకున్నారు. అప్పట్లో బ్యాచ్ విద్యార్థులు పెంకే నిర్మల, బాల ప్రసన్న, తాడి రాజేష్, నాతి అంబేడ్కర్, సుంకర చినబాబు, పోతుల నానీబాబు, ఏ.అప్పారావు, పంపన సురేష్ తదితర 45 మంది విద్యార్థులు రూ.50 వేలు విలువ చేసే ఆర్వో ప్లాంట్‌ను పాఠశాలలో ఏర్పాటు చేశారు. అప్పటి ప్రధానోపాధ్యాయుడు చోడిశెట్టి ఆంజనేయులు, ఎంఈవో యు.లజపతిరాయ్ తదితర 15 మంది ఉపాధ్యాయులను సన్మానించారు.



పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్

దేవాలయాలు, పుణ్యక్షేత్రాల్లో ప్లాస్టిక్ విక్రయాలు నిషేధించాలి

కొత్తపేట, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): దేవాలయాలు, పుణ్యక్షేత్రాల వద్ద ప్లాస్టిక్ విక్రయాలు నిషేధించి అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం అన్నారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అన్ని దేవాలయాల్లో భక్తులు పూజా సామగ్రిని ప్లాస్టిక్ కవర్లలో తీసుకుని వెళ్లకుండా ప్రధాన ద్వారం వద్దనే నియంత్రించేలా దేవదాయ ధర్మాదాయశాఖ చర్యలు తీసుకోవాలన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారులు, దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు ప్లాస్టిక్ రహిత దేవాలయాలుగా ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు.



ప్రసన్నకుమార్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే బండారు

ప్రసన్నకుమార్ సేవలు ప్రశంసనీయం

కొత్తపేట, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): అత్యధికంగా కొత్తపేట నియోజకవర్గం రావులపాలెంలో ఎస్ఐగా, సీఐగా సేవలు అందించడమే కాకుండా అమలాపురం డీఎస్పీగా ఆయన అందించిన సేవలు ప్రశంసనీయమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. విజయవాడలో ఆదివారం అడిషనల్ డీసీపీగా ప్రసన్నకుమార్ ఉద్యోగ విరమణ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, కంఠంశెట్టి శ్రీనివాస్, ధర్నాల రామకృష్ణ, గుబ్బల మూర్తి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్‌గా రమేష్



కె.గంగవరం, ఆగస్టు 31(ఆంధ్ర జ్యోతి): స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్‌గా సత్యవాడ గ్రామానికి చెందిన సలాది పట్టాభి రామయ్య (రమేష్) నియమితులయ్యారు. ఈ మేరకు టీడీపీ రాష్ట్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. సలాది రమేష్‌గా పిలువబడే పట్టాభిరామయ్య తెలుగుదేశం పార్టీ అభిమాని. నిస్వార్థంగా పనిచేస్తే ఎప్పటికైనా గుర్తింపు ఉంటుందని చెప్పడానికి తానే నిదర్శనమన్నారు. తనకు పదవి రావడంలో సహకరించిన కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు, టీడీపీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యంకు, ఎంపీ గంటి హరీష్ మాధుర్ తదితరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ప్రధాన రహదారులే పార్కింగ్ ప్రదేశాలు

• రెసిడెన్షియల్‌కు అనుమతులు...కమర్షియల్ కాంప్లెక్స్‌ల నిర్మాణాలు • పట్టించుకోని అధికార యంత్రాంగం
• ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి రోడ్డుపైకి షెడ్లు, ఫ్లాట్‌ఫాం నిర్మాణాలు • ప్రేక్షక పాత్రలో ట్రాఫిక్ పోలీసులు

రావులపాలెం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రావులపాలెం జంక్షన్‌లో పలు నిర్మాణాలకు అనుమతులు లేకున్నా యథేచ్ఛగా వెలుస్తున్నాయి. వాటిని కూల్చివేయాల్సిన అధికార యంత్రాంగం చోద్యం చూస్తోందన్న ఆరోపణలు వెల్లువెతుతున్నాయి. ఆయా వాణిజ్య సముదాయాలకు వచ్చే వాహనదారులకు పార్కింగ్ స్థలంతో పాటు, ఫైర్ సేఫ్టీ తదితర అంశాలను వారు కల్పించాల్సి ఉంది. వీటికి విరుద్ధంగా షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించడంతో పాటు ప్రభుత్వ స్థలాలను సైతం ఆక్రమించి కడుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా కోనసీమ ముఖద్వారం వద్ద, తహశీల్దారు కార్యాలయం రోడ్డు, కాలువగట్టు, సర్వీస్ రోడ్ల ప్రాంతాల్లో గతంలో షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించారు. పైగా రెసిడెన్షియల్ నిర్మాణాల పేరిట అనుమతులు పొంది ఆ తర్వాత కమర్షియల్ కాంప్లెక్స్‌లుగా నిర్మిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. షాపింగ్ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న రహదారిని ఆక్రమించి చిరు వ్యాపారాలకు అద్దెలకు ఇచ్చి సొమ్ములు చేసుకుంటున్నా ఆయా ఆక్రమణలపై కన్నెత్తి చూసే అధికారులు కరువయ్యారంటూ పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ప్రతిరోజూ ఆయా రహదారులలో ట్రాఫిక్ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రింగ్‌రోడ్డులో ఇష్టానుసారం పార్కింగ్‌తో ట్రాఫిక్ స్తంభించిపోతుంది. రావులపాడు జంక్షన్ హాస్పటల్స్ సెంటర్ వద్ద నుంచి కళా వెంకట్రావు సెంటర్ వరకూ ఇరువైపులా ఆక్రమణల కారణంగా నడిచి వెళ్లేందుకు కూడా వీలులేని పరిస్థితి ఏర్పడుతుంది. ప్రధాన రహదారిపై ఇష్టానుసారం వాహనాలు పార్కింగ్ చేస్తున్నప్పటికి పోలీస్ యంత్రాంగం చర్యలు తీసుకోకపోవడంతో వాహనదారులు రోడ్డుపైనే వాహనాలు పార్కింగ్ చేస్తున్నారంటూ పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.





రావులపాలెం రింగ్‌రోడ్డులో రహదారిపైనే పార్కింగ్ చేసిన వాహనాలు. పక్క చిత్రంలో రావులపాలెం తహసీల్దారు కార్యాలయం రోడ్డులో రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేసిన బైకులు

గణితశాస్త్రం అభివృద్ధికి జీవంపోస్తున్న పోటీలు

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గణితశాస్త్రం అభివృద్ధికి గణిత పోటీలు జీవం పోస్తున్నాయని రామానుజన్ గణిత అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కేవీవీ సత్యనారాయణ అన్నారు. ఆదివారం రామానుజన్ గణిత అకాడమీలో గణిత సమస్యల సాధన అనే కార్యక్రమంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో వక్తలు గౌస్ బాషా, బి.శేఖర్‌బాబు, డి.శ్రీనివాసరావు, మురళీ ప్రసంగించారు. తొలుత రామానుజన్ కాంస్య విగ్రహానికి నివాళులర్పించారు. గణిత శాస్త్ర గంథాలయాన్ని సందర్శించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందచేశారు. కార్యక్రమంలో గణిత అకాడమీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా స్వామివారి కల్యాణం

ఆత్రేయపురం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీనెలకొంది. అధిక సంఖ్యలో భక్తులు ఐశ్వర్యలక్ష్మీ హోమం, గోపూజ, తులాభారాలు నిర్వహించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను ఈవో సూర్యచక్రధరరావు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.